పత్రికతో.. మార్పులు

APTEL/25/A1880

# TN తెలుగు న్యూస్

దిన పత్రిక

మా కలం మీ గళం.. సామాన్యుని గుండె చప్పుడు..

సంపుటి : 1 | సంచిక : 748 | పబ్లిషర్స్ & చీఫ్ ఎడిటర్ : యన్. కృష్ణారావు | ఎడిటర్ : ఎస్. మస్తాన్ | శనివారం 17.10.2026 | పేజీలు : 8 | వెల : 4/-


## రాష్ట్రపతికి లోకేశ్
# ఏపీ చేనేత, హస్తకళల కానుకలు

- విజయవాడలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో మంత్రి లోకేశ్ భేటీ
- దసరా ఉత్సవాలు, సరస్ మేళాలో పాల్గొనేందుకు వచ్చిన రాష్ట్రపతి
- స్వాగతం పలికి సత్కరించిన నారా లోకేశ్



2లో

## ఇంద్రకీలాద్రిపై వైభవంగా
# సీఎం పట్టువస్త్రాల సమర్పణ

- విజయవాడలో ఎన్టీఆర్ ట్రస్ట్ రక్త నిధి కేంద్రం ఏర్పాటును అభినందించిన సీఎం చంద్రబాబు
- సంస్థ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి బృందానికి ప్రత్యేక అభినందనలు
- తలసేమియా చిన్నారులకు ఉచిత రక్తం అందించడం గొప్ప మానవీయ సేవ అని కొనియాడారు
- విద్యా, వైద్య రంగాల్లో ట్రస్ట్ అందిస్తున్న సేవలను ప్రస్తావించిన ముఖ్యమంత్రి
- ప్రాణ రక్షణే లక్ష్యంగా ట్రస్ట్ ముందుకు సాగాలని ఆకాంక్ష



2లో

## విజయవాడలో
# ఎన్టీఆర్ ట్రస్ట్ భవనం ప్రారంభం

- బ్లడ్ బ్యాంక్‌తో పాటు తలసేమియా కేర్ సెంటర్‌ను అందుబాటులోకి తెచ్చిన ట్రస్ట్
- విజయవాడ పరిసర ప్రాంతాల్లోని పేదలకు వైద్య సేవలు అందించడమే లక్ష్యం
- ఇప్పటికే పలు నగరాల్లో ఎన్టీఆర్ ట్రస్ట్ రక్తనిధి కేంద్రాల నిర్వహణ



ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ తన సేవా కార్యక్రమాలను మరింత విస్తరించింది. విజయవాడలోని స్టెల్లా కళాశాల సమీపంలో నూతనంగా నిర్మించిన ట్రస్ట్ భవనాన్ని, రక్తనిధి కేంద్రాన్ని ఆ సంస్థ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గతేడాది శంకుస్థాపన జరుపుకున్న ఈ భవన నిర్మాణాన్ని ట్రస్ట్ విజయవంతంగా పూర్తి చేసింది. విజయవాడ పరిసర ప్రాంతాల్లోని పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో ఈ నూతన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా బ్లడ్ బ్యాంక్‌తో పాటు, తలసేమియా వ్యాధితో బాధపడే చిన్నారులకు ఉచితంగా రక్తాన్ని అందించేందుకు ప్రత్యేకంగా తలసేమియా కేర్ సెంటర్‌ను కూడా అందుబాటులో తరువాయి 2లో

## ఆర్థికాభివృద్ధికి
# కీలక ముందడుగు

- వీలైనంత త్వరగా ఒప్పందాన్ని ముగిస్తామన్న కేంద్రమంత్రి నిర్మల
- ఒప్పందం మొదటి దశ పూర్తయిందని, లీగల్ డ్రాఫ్ట్ సిద్ధమవుతోందని వెల్లడి
- ప్రపంచ అనిశ్చితుల మధ్య కూడా భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోందని స్పష్టం

2లో



## ఈ నెలలే పార్లమెంట్ ప్రత్యేక భేటీ..
# ఆ రెండు కీలక బిల్లులపైనే చర్చ!

- ఈ నెలలో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించే అవకాశం
- మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన బిల్లులపై కేంద్రం దృష్టి
- ఏప్రిల్ 17న లోక్‌సభలో వీగిపోయిన రాజ్యాంగ సవరణ బిల్లు
- బిల్లుల ఆమోదానికి పార్లమెంట్‌లో ప్రత్యేక మెజారిటీ తప్పనిసరి
- డీఎంకే సహా పలు పార్టీల మద్దతు కోసం కేంద్రం ప్రయత్నాలు



మహిళా రిజర్వేషన్లు, లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లులను ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ నెలలో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. లోక్‌సభలో ఈ బిల్లులను ఆమోదింపజేసేందుకు అవసరమైన మద్దతు తమకు ఉందని కేంద్రం ధీమాగా ఉన్నట్లు సమాచారం. మరోవైపు ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్), ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ అంశాలపై ప్రతిపక్షాల నిరసనలు కొనసాగుతున్నాయి. తరువాయి 2లో

# విమాన టికెట్ల ధరలకు కళ్లెం.
## కేంద్రం ముందడుగు




- భారతీయ వాయుయాన్ అధినియమ్ కింద నిబంధనలకు ఆమోదం
- రెండు వారాల్లో రూల్స్ ప్రమరిస్తామని సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్రం
- విమాన ఛార్జీల నియంత్రణ కోరుతూ దాఖలైన పిటిషన్‌పై విచారణ
- పండుగల వేళ ఛార్జీల పెంపుపై గతంలో సుప్రీంకోర్టు ఆందోళన
- నవంబర్ 16కు తదుపరి విచారణ వాయిదా వేసిన ధర్మాసనం

దేశంలో విమాన ఛార్జీల నియంత్రణ దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. భారత విమానయాన రంగాన్ని క్రమబద్ధీకరించేందుకు తీసుకువచ్చిన తరువాయి 2లో



## పిల్లల సోషల్ మీడియా భద్రత
# కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసులు

- సోషల్ మీడియా ముప్పు నుంచి పిల్లల రక్షణపై కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసు
- పటిష్ఠమైన నియంత్రణ, వయసు నిర్ధారణ ఉండాలని కోరిన పిటిషనర్లు
- ప్రస్తుత చట్టాలు సరిపోవని, పిల్లలపై తీవ్ర ప్రభావం పడుతోందని పిటిషన్‌లో వెల్లడి
- ఆన్‌లైన్ వేధింపులు, మానసిక ఆరోగ్యంపై పిటిషనర్ల ఆందోళన

2లో

## డీఎంకే, ఏఐఏడీఎంకేలకు ఒకే సంస్థ నుంచి
# రూ.260 కోట్ల విరాళాలు!



- డీఎంకే, ఏఐఏడీఎంకేలకు ఒకే సంస్థ భారీ విరాళాలు
- కోల్‌కతాకు చెందిన టైగర్ అసోసియేట్స్ నుంచి రూ.260 కోట్లు
- ఏఐఏడీఎంకేకు రూ.135 కోట్లు, డీఎంకేకు రూ.125 కోట్లు
- లాటరీ కింగ్ శాంటియాగో మార్టిన్‌తో సంస్థకు సంబంధాలు

తమిళనాడు రాజకీయాల్లో బద్ధ విరోధులైన డీఎంకే, ఏఐఏడీ తరువాయి 2లో

# ఇంద్రకీలాద్రిపై వైభవంగా సీఎం పట్టువస్త్రాల సమర్పణ

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ అందిస్తున్న సేవలపై ప్రశంసల వర్షం కురిపించారు. విజయవాడలో కొత్తగా ఎన్టీఆర్ ట్రస్ట్ రక్త నిధి కేంద్రాన్ని ఏర్పాటు చేసిన నేపథ్యంలో, ఆయన ప్రత్యేకంగా అభినందించారు. రక్తం అందక ఏ ఒక్క ప్రాణమూ ప్రమాదంలో పడకూడదనే గొప్ప సంకల్పంతో ఈ కేంద్రాన్ని ప్రారంభించడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా తన అర్ధాంగి, సంస్థ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి, ఆమె బృందానికి చంద్రబాబు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. “ఒక్కరి రక్తదానం ఆపదలో ఉన్న మరో కుటుంబానికి జీవన ప్రదాత అవుతుంది. ప్రాణాపాయంలో ఉన్నవారికి పునర్జన్మనిస్తుంది” అని చంద్రబాబు పేర్కొన్నారు. ముఖ్యంగా తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు ఉచితంగా రక్తం అందించాలనే నిర్ణయం గొప్ప మానవీయ సేవ అని ఆయన కొనియాడారు. కేవలం బ్లడ్ బ్యాంక్ మాత్రమే కాకుండా, విద్యా, వైద్యం, మహిళా సాధికారత వంటి ఎన్నో రంగాల్లో ఎన్టీఆర్ ట్రస్ట్ అందిస్తున్న సేవలను చంద్రబాబు గుర్తుచేశారు. ‘సంజీవని మొబైల్ క్లినిక్స్’ ద్వారా మారుమూల గ్రామీణ, గిరిజన ప్రాంతాలకు వైద్య సేవలు చేరవేయడం స్ఫూర్తిదాయకమని ప్రశంసించారు. ప్రతి సేవలో మానవత్వం, ప్రతి ప్రయత్నంలో ప్రాణ రక్షణే లక్ష్యంగా ఎన్టీఆర్ ట్రస్ట్ తన సేవలను మరింతగా విస్తరించి, ఎంతో మందికి అండగా నిలవాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.



రాష్ట్రపతికి లోకేశ్

## ఏపీ చేనేత, హస్తకళల కానుకలు

ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. విజయవాడ పర్యటనలో ఉన్న రాష్ట్రపతిని ఆయన నోవోటెల్ హోటల్‌లో కలిశారు. విజయవాడ ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొనడంతో పాటు, జాతీయ స్థాయిలో మహిళా స్వయం సహాయక బృందాల ఉత్పత్తుల కోసం ఏర్పాటు చేసిన ‘జాతీయ సరస్ మేళా’కు ముఖ్య అతిథిగా హాజరయ్యేందుకు నిన్న రాష్ట్రపతి నగరానికి విచ్చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రపతిని కలిసిన లోకేశ్, ఆమెకు స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాల్లో పాల్గొనడానికి, మహిళా స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులతో ఏర్పాటు చేసిన ‘సరస్ మేళా’లో పాలుపంచుకోవడానికి విజయవాడ వచ్చినందుకు రాష్ట్రపతికి లోకేశ్ ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా, రాష్ట్రపతికి లోకేశ్ ప్రత్యేక కానుకలు అందజేశారు. రాష్ట్ర చేనేత కళకు, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచే ప్రసిద్ధ మంగళగిరి చేనేత చీరను బహూకరించారు. దీంతో పాటు, తెలుగు కళాకారుల హస్తకళా నైపుణ్యానికి నిలువుటద్దం పట్టే ఏటికొప్పాక లక్క బొమ్మలను కూడా ఆయన రాష్ట్రపతికి బహుమతిగా ఇచ్చారు. ఈ కానుకలు మన కళాకారుల వారసత్వానికి గర్వకారణమని లోకేశ్ పేర్కొన్నారు. ఈ సమావేశానికి సంబంధించిన వివరాలను మంత్రి నారా లోకేశ్ తన సోషల్ మీడియా ఖాతా ద్వారా పంచుకున్నారు. రాష్ట్రపతిని కలవడం గౌరవంగా భావిస్తున్నానని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు.

## ఈ నెలే పార్లమెంట్ ప్రత్యేక భేటీ.. ఆ రెండు కీలక బిల్లులపైనే చర్చ!

మహిళా రిజర్వేషన్లు, లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లులను ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ నెలలో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. లోక్‌సభలో ఈ బిల్లులను ఆమోదింపజేసేందుకు అవసరమైన మద్దతు తమకు ఉందని కేంద్రం ధీమాగా ఉన్నట్లు సమాచారం. మరోవైపు ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్), ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ అంశాలపై ప్రతిపక్షాల నిరసనలు కొనసాగుతున్నాయి. ప్రతిపాదిత బిల్లులకు మద్దతు కూడగట్టేందుకు కేంద్రం ప్రతిపక్ష పార్టీలతోనూ చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. ఈ ఏడాది ఏప్రిల్ 17న బడ్జెట్ సమావేశాల సందర్భంగా నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ల అమలుకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోయింది. దీంతో ఈసారి బిల్లులను ఆమోదింపజేసుకోవడం కేంద్రానికి కీలకంగా మారింది.

### రెండు వంతుల మెజారిటీ అవసరం

రాజ్యాంగ సవరణ బిల్లుల ఆమోదానికి పార్లమెంట్‌లో ప్రత్యేక మెజారిటీ అవసరం. లోక్‌సభలో ప్రస్తుతం 540 మంది సభ్యులుండగా, మొత్తం సభ్యుల్లో మూడింట రెండొంతుల మద్దతు కీలకం. ఈ లెక్కన సుమారు 360 మంది సభ్యుల మద్దతు అవసరం. ఎన్డీయేకు లోక్‌సభలో మెజారిటీ ఉన్నప్పటికీ, రాజ్యాంగ సవరణకు అవసరమైన సంఖ్యాబలం విషయంలో సవాళ్లు ఉన్నట్లు సమాచారం. ప్రభుత్వానికి మద్దతు పెరిగిందని, తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన 20 మంది ఎంపీలు, శివసేన (యూబీటీ)కి చెందిన ఆరుగురు ఎంపీలు అధికార పక్షం వైపు మారారని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. అయితే బిల్లుల ఆమోదానికి అవసరమైన సంఖ్యాబలంపై తుది స్పష్టత ఓటింగ్ సమయంలోనే రానుంది.

### డీఎంకేతో చర్చలు

బిల్లులకు మద్దతు కూడగట్టేందుకు డీఎంకేతో కేంద్రం చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. తమిళనాడు ఎన్నికల తర్వాత కాంగ్రెస్‌తో ఆ పార్టీ విభేదాలు రావడం, ఇండియా కూటమి నుంచి బయటకు రావడం నేపథ్యంలో ఈ సంప్రదింపులకు ప్రాధాన్యం ఏర్పడింది. మరికొన్ని చిన్న ప్రతిపక్ష పార్టీలతోనూ కేంద్రం మాట్లాడుతున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఆగస్టు 13న ముగిసిన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ఇంకా అధికారికంగా ప్రొరోగేషన్ ప్రకటించలేదు. దీంతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించేందుకు అవకాశం ఉందని సమాచారం. అక్టోబర్ 26, 27 తేదీల్లో సంవిధాన్ సదన్‌లో జరగనున్న 12వ బ్రిక్స్ పార్లమెంటరీ ఫోరమ్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక సమావేశాల తేదీలను ఖరారు చేయనున్నట్లు తెలుస్తోంది. సమావేశాలకు వారం రోజుల ముందుగా నోటీసు ఇచ్చే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

## విజయవాడలో ఎన్టీఆర్ ట్రస్ట్ భవనం ప్రారంభం

ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ తన సేవా కార్యక్రమాలను మరింత విస్తరించింది. విజయవాడలోని స్టెల్లా కళాశాల సమీపంలో నూతనంగా నిర్మించిన ట్రస్ట్ భవనాన్ని, రక్తనిధి కేంద్రాన్ని ఆ సంస్థ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గతేడాది శంకుస్థాపన జరుపుకున్న ఈ భవన నిర్మాణాన్ని ట్రస్ట్ విజయవంతంగా పూర్తి చేసింది. విజయవాడ పరిసర ప్రాంతాల్లోని పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో ఈ నూతన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా బ్లడ్ బ్యాంక్‌తో పాటు, తలసేమియా వ్యాధితో బాధపడే చిన్నారులకు ఉచితంగా రక్తాన్ని అందించేందుకు ప్రత్యేకంగా తలసేమియా కేర్ సెంటర్‌ను కూడా అందుబాటులోకి తీసుకువచ్చారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ప్రారంభమైన నాటి నుంచి తెలుగు రాష్ట్రాల్లోని ప్రజలకు విస్తృతంగా వైద్య ఆరోగ్య సేవలు అందిస్తోంది. ఇప్పటికే గుంటూరు, విశాఖపట్నం, తిరుపతి, రాజమహేంద్రవరంలో రక్తనిధి కేంద్రాలను నిర్వహిస్తుండగా, తాజాగా విజయవాడలోనూ ఈ సేవలు ప్రారంభమయ్యాయి. వీటితో పాటు అన్ని నియోజకవర్గాల్లో ‘ఎన్టీఆర్ ఆరోగ్య రథం’ పేరుతో మొబైల్ క్లినిక్‌ల ద్వారా కూడా వైద్య సేవలను ప్రజల వద్దకే తీసుకెళుతోంది.

## డీఎంకే, ఏఐఏడీఎంకేలకు ఒకే సంస్థ నుంచి రూ.260 కోట్ల విరాళాలు!

తమిళనాడు రాజకీయాల్లో బద్ధ విరోధులైన డీఎంకే, ఏఐఏడీఎంకేలకు ఒకే సంస్థ నుంచి భారీగా నిధులు అందిన విషయం వెలుగులోకి వచ్చింది. కోల్‌కతా కేంద్రంగా పనిచేసే టైగర్ అసోసియేట్స్ అనే లాటరీ సంస్థ, 202526 ఆర్థిక సంవత్సరంలో ఈ రెండు పార్టీలకు కలిపి ఏకంగా రూ. 260 కోట్ల విరాళాలు అందించింది. ఎన్నికల సంఘానికి సమర్పించిన నివేదికల ద్వారా ఈ కీలక సమాచారం బయటపడింది. టైగర్ అసోసియేట్స్ సంస్థ, ఏఐఏడీఎంకేకు ఆరు లావాదేవీల ద్వారా రూ. 135 కోట్లు, డీఎంకేకు 14 లావాదేవీల ద్వారా రూ. 125 కోట్లు విరాళంగా ఇచ్చింది. ఇది ఆ ఏడాది ఆయా పార్టీలకు అందిన మొత్తం విరాళాల్లో చాలా పెద్ద మొత్తం. ఏఐఏడీఎంకేకు వచ్చిన మొత్తం విరాళాలు రూ. 161.36 కోట్లు కాగా, అందులో దాదాపు 81 శాతం వాటా టైగర్ అసోసియేట్స్ నుంచే రావడం గమనార్హం. అదేవిధంగా, డీఎంకేకు అందిన రూ. 191.19 కోట్ల విరాళాల్లో 65 శాతానికి పైగా ఇదే సంస్థ నుంచి సమకూరింది. అంతకుముందు ఏడాదితో పోలిస్తే ఈ సంస్థ ఇచ్చిన విరాళాలు రెట్టింపు కంటే ఎక్కువగా ఉన్నాయి. 202425లో ఈ రెండు పార్టీలకు కలిపి రూ. 110 కోట్లు ఇచ్చిన టైగర్ అసోసియేట్స్, గత రెండు ఆర్థిక సంవత్సరాల్లో మొత్తం రూ.370 కోట్లు అందించింది.

### శాంటియాగో మార్టిన్‌తో సంబంధాలు

ఈ సంస్థకు ప్రముఖ లాటరీ వ్యాపారి శాంటియాగో మార్టిన్‌తో సంబంధాలు ఉన్నాయి. టైగర్ అసోసియేట్స్ భాగస్వామిగా ఉన్న సుబ్బయ్యన్ నాగరాజన్, మార్టిన్‌కు చిరకాల సహచరుడు. కార్పొరేట్ రికార్డుల ప్రకారం, వీరిద్దరూ మరో సంస్థలో కూడా భాగస్వాములుగా ఉన్నారు. గతంలో సుప్రీంకోర్టు రద్దు చేసిన ఎలక్టోరల్ బాండ్ల పథకంలో అతిపెద్ద కొనుగోలుదారుగా మార్టిన్‌కు చెందిన ఫ్యూచర్ గేమింగ్ అండ్ హోటల్ సర్వీసెస్ నిలిచింది. ఆ సంస్థ డీఎంకేకు బాండ్ల రూపంలో రూ. 509 కోట్లు ఇచ్చింది. అయితే, ఫ్యూచర్ గేమింగ్, టైగర్ అసోసియేట్స్ వేర్వేరు సంస్థలని, టైగర్ అసోసియేట్స్ ఇచ్చిన విరాళాలకు మార్టిన్ వ్యక్తిగతంగా నిధులు సమకూర్చారా అనే దానికి ప్రత్యక్ష ఆధారాలు లేవని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

### ఇతర ట్రస్టుల నుంచి కూడా

టైగర్ అసోసియేట్స్‌తో పాటు పలు ఎలక్టోరల్ ట్రస్టులు కూడా ఈ పార్టీలకు భారీగా నిధులు సమకూర్చాయి. ట్రయంఫ్ ఎలక్టోరల్ ట్రస్ట్ డీఎంకేకు రూ.15 కోట్లు, ఏఐఏడీఎంకేకు రూ.5 కోట్లు ఇవ్వగా, జైభారత్ ఎలక్టోరల్ ట్రస్ట్ వరుసగా రూ.4 కోట్లు, రూ.3 కోట్లు అందించింది. ప్రుడెంట్ ఎలక్టోరల్ ట్రస్ట్ డీఎంకేకు రూ.25 కోట్లు విరాళంగా ఇచ్చింది. ఈ మూడు ట్రస్టులు, టైగర్ అసోసియేట్స్ కలిపి అందించిన విరాళాలు రూ.312 కోట్లు. అంటే, ఈ రెండు పార్టీల మొత్తం విరాళాల్లో ఇది సుమారు 88.5 శాతం. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని నెలల ముందు, ముఖ్యంగా 2026 ఫిబ్రవరి, మార్చిలో ఈ భారీ విరాళాల బదిలీ జరగడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. కీలక ఎన్నికల ముందు తమిళనాడులోని ప్రధాన ద్రవిడ పార్టీల రాజకీయ నిధులు కేవలం కొద్దిమంది వనరులపైనే కేంద్రీకృతమై ఉన్నాయనడానికి ఈ నివేదికలు అద్దం పడుతున్నాయి.

మున్సిపల్ ఎన్నికలు

## కూటమి సీట్ల లెక్క తేలింది!

ఆంధ్రప్రదేశ్‌లో అధికార టీడీపీజనసేన బీజేపీ కూటమి రాబోయే పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల కోసం పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతోంది. 2026లో జరగనున్న మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి మిత్రపక్షాల మధ్య సీట్ల పంపకం ప్రక్రియను పూర్తి చేసింది. రాష్ట్రంలోని 17 మున్సిపల్ కార్పొరేషన్లు, 106 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు గాను ఏ పార్టీ ఎక్కడ పోటీ చేయాలో స్పష్టతనిస్తూ కూటమి నాయకత్వం తుది నిర్ణయం తీసుకుంది. ఈ పంపకాల్లో, ఇటీవలి సార్వత్రిక ఎన్నికల మాదిరిగానే తెలుగుదేశం పార్టీకి సింహభాగం దక్కింది.

**కార్పొరేషన్ల కేటాయింపు ఇలా..**

రాష్ట్రంలోని 17 మున్సిపల్ కార్పొరేషన్ల విషయానికి వస్తే, టీడీపీ 11 స్థానాల్లో పోటీ చేయనుంది. జనసేన పార్టీకి 4, బీజేపీకి 2 కార్పొరేషన్లను కేటాయించారు. గ్రేటర్ విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, తిరుపతి వంటి కీలక నగరాల భవిష్యత్తును ఈ పంపకం నిర్దేశించనుంది. విశాఖ, గుంటూరు, తిరుపతి, మచిలీపట్నం వంటి ప్రధాన కార్పొరేషన్లను టీడీపీ తన వద్ద ఉంచుకోగా, విజయవాడ, కాకినాడ, శ్రీకాకుళం, ఏలూరు కార్పొరేషన్లలో జనసేన అభ్యర్థులు బరిలోకి దిగనున్నారు. ఇక, రాజమహేంద్రవరం, అనంతపురం కార్పొరేషన్లను బీజేపీకి కేటాయించారు. మొత్తం మీద చూస్తే, 123 పట్టణ స్థానిక సంస్థల్లో టీడీపీ 89, జనసేన 25, బీజేపీ 9 స్థానాల్లో పోటీ చేయనున్నాయి. సార్వత్రిక ఎన్నికల ఫలితాల స్ఫూర్తితో, రెండేళ్ల ముందుగానే స్థానిక సంస్థల ఎన్నికలకు పక్కా ప్రణాళికతో సిద్ధమవడం ద్వారా క్షేత్రస్థాయిలో తమ పట్టును మరింత పటిష్టం చేసుకోవాలని కూటమి భావిస్తున్నట్లు ఈ సీట్ల పంపకం స్పష్టం చేస్తోంది.

## ఆర్థికాభివృద్ధికి కీలక ముందడుగు

భారత్అమెరికా మధ్య ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న వాణిజ్య ఒప్పందం త్వరలోనే కార్యరూపం దాల్చనుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. అమెరికాతో జరుగుతున్న చర్చలు ప్రస్తుతం తుది దశకు చేరుకున్నాయని ఆమె తెలిపారు. బ్యాంకాక్‌లో నిర్వహిస్తున్న ఐఎంఎఫ్‌ప్రపంచ బ్యాంక్ వార్షిక సమావేశాల్లో భాగంగా ఆమె ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఒప్పందానికి సంబంధించిన మొదటి దశ ఇప్పటికే ఖరారైందని, ప్రస్తుతం దీనికి సంబంధించిన న్యాయపరమైన ముసాయిదా (లీగల్ డ్రాఫ్ట్) సిద్ధం చేస్తున్నట్లు వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ తనకు వివరించారని నిర్మల తెలిపారు. త్వరలోనే ఈ ఒప్పందంపై సంతకాలు జరుగుతాయని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ వాణిజ్యంతో పాటు, ఇరు దేశాల ద్వైపాక్షిక ఆర్థిక, వాణిజ్య ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో భారత ఆర్థిక వ్యవస్థ పనితీరుపై కూడా మంత్రి ప్రసంగించారు. అంతర్జాతీయంగా అనేక అనిశ్చితులు నెలకొన్నప్పటికీ, భారత్ స్థిరమైన వృద్ధిని సాధిస్తోందని పేర్కొన్నారు. కొవిడ్ మహమ్మారి తదుపరి కాలంలో, గత నాలుగైదేళ్లుగా ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా భారత్ నిలిచిందని ఆమె గుర్తుచేశారు. ప్రభుత్వం అనుసరిస్తున్న సమ్మిళిత వృద్ధి విధానాలు, నైపుణ్యాభివృద్ధిలో పెట్టుబడులు, కఠినమైన ఆర్థిక క్రమశిక్షణ వంటి చర్యల వల్లే ఇది సాధ్యమైందని ఆమె వివరించారు. ప్రజాధనం వినియోగం పట్ల ప్రభుత్వానికి పూర్తి జవాబుదారీతనం ఉందని ఈ సందర్భంగా ఆమె స్పష్టం చేశారు.

## పిల్లల సోషల్ మీడియా భద్రత..

కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసులు

సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల వల్ల పిల్లలు ఎదుర్కొంటున్న ప్రమాదాల నుంచి వారిని రక్షించేందుకు సమగ్రమైన, పటిష్ఠమైన నియంత్రణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు స్పందించింది. ఈ విషయంపై ఈరోజు కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్ మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు విచారణ చేపట్టింది. ‘ది ఎమరాల్డ్ హైట్స్ ఇంటర్నేషనల్ స్కూల్’, దాని డైరెక్టర్ సిద్ధార్థ్ సింగ్ గిర్నార్ ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. సోషల్ మీడియా వాడకానికి కనీస వయసు నిబంధనలు, ఆన్‌లైన్ వేధింపుల నుంచి రక్షణ కల్పించే మార్గదర్శకాలు రూపొందించాలని వారు తమ పిటిషన్‌లో కోరారు. కేంద్ర ప్రభుత్వం, మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ, న్యాయ మంత్రిత్వ శాఖ, జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌ను ప్రతివాదులుగా చేర్చారు. ఇప్పటికే ఇలాంటి అంశంపై పెండింగ్‌లో ఉన్న మరో కేసుతో ఈ పిటిషన్‌ను ధర్మాసనం జతచేసింది. తదుపరి విచారణను డిసెంబర్ 3వ తేదీకి వాయిదా వేసింది.

## విమాన టికెట్ల ధరలకు కళ్లెం.. కేంద్రం ముందడుగు

దేశంలో విమాన ఛార్జీల నియంత్రణ దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. భారత విమానయాన రంగాన్ని క్రమబద్ధీకరించేందుకు తీసుకువచ్చిన "భారతీయ వాయుయాన్ అధినియమ్2024" చట్టం కింద రూపొందించిన నిబంధనలకు పరిపాలనాపరమైన ఆమోదం లభించిందని కేంద్రం సుప్రీంకోర్టుకు తెలియజేసింది. రాబోయే రెండు వారాల్లో ఈ నిబంధనలను నోటిఫై చేసే అవకాశం ఉందని స్పష్టం చేసింది. శుక్రవారం జరిగిన విచారణలో సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ ఆర్. మహదేవన్, జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్‌లతో కూడిన ధర్మాసనానికి ఈ వివరాలను వెల్లడించారు. నిబంధనలను ఇప్పటికే ఖరారు చేసినట్లు ఆయన కోర్టుకు వివరించారు. దీనిపై స్పందించిన ధర్మాసనం, నోటిఫై చేసిన నిబంధనల ప్రతిని తమ ముందు ఉంచాలని కేంద్రాన్ని ఆదేశిస్తూ, తదుపరి విచారణను నవంబర్ 16వ తేదీకి వాయిదా వేసింది. విమానయాన రంగంలో పారదర్శకతను పెంచడంతో పాటు ప్రయాణికుల ప్రయోజనాలను కాపాడేందుకు స్వతంత్ర నియంత్రణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరుతూ సామాజిక కార్యకర్త ఎస్. లక్ష్మీనారాయణన్ సుప్రీంకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. ప్రైవేట్ విమానయాన సంస్థలు టికెట్ ధరలను, అనుబంధ ఛార్జీలను ఇష్టానుసారంగా పెంచకుండా నియంత్రించేందుకు పటిష్ఠమైన మార్గదర్శకాలు రూపొందించాలని ఆయన తన పిటిషన్‌లో అభ్యర్థించారు. బ్రిటిష్ కాలం నాటి 'ఎయిర్‌క్రాఫ్ట్ యాక్ట్1934' స్థానంలో కేంద్ర ప్రభుత్వం ఈ "భారతీయ వాయుయాన్ అధినియమ్ 2024"ను తీసుకువచ్చింది. విమానాల డిజైన్, తయారీ, నిర్వహణ, వినియోగం, అమ్మకాలు, ఎగుమతి, దిగుమతి వంటి అన్ని కీలక అంశాలను పర్యవేక్షించేందుకు ఈ చట్టం ఒక ఆధునిక చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్‌ను కల్పిస్తుంది. ఈ ముసాయిదాను సుప్రీంకోర్టుకు కేంద్రం ఇటీవలే అందించింది.

# సంపాదకీయం

## జగన్ కేసుల్లో ఈడీ దూకుడు

## న్యాయపోరాటమా? రాజకీయ వ్యూహమా?

జగన్ పైన ఉన్న కేసులను రోజువారీ విచారణకు ఆదేశాలు ఇవ్వాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈడీ వేసిన పిటిషన్‌లో పేర్కొన్న అంశాలలో ముఖ్యమైన విషయం, భారీ మొత్తంలో ప్రజాధనం చేతులు మారిన ఆర్థిక నేరాలు దేశ ఆర్థిక వ్యవస్థకి ప్రమాదకరమని పేర్కొనడం ఆశ్చర్యం కలిగించింది. ఈ మాట చెప్పడానికి ఈడీకి ఇంతకాలం పట్టడం ఆశ్చర్యమే మరి. ఈడీ, సీబీఐ లాంటి సంస్థలు ఇలా మధ్యమధ్యలో మెరుపులు మెరిపిస్తూ ఉంటాయి. అలా వార్తలు రాగానే జగన్ మోహన్ రెడ్డి ఆట కట్టు అని జగన్ వ్యతిరేకులు భావిస్తూ ఉంటారు. మద్యం కేసులో ఈడీ ప్రవేశించగానే ఇలాగే జగన్ పని అయిపోయింది అంటారు. ఇక వివేకానంద రెడ్డి హత్య కేసులో జరిగిందని చెప్పబడుతున్న సుపారీ గురించి లెక్క తేల్చడానికి ఈడీ ప్రవేశించగానే జగన్ మోహన్ రెడ్డిని ఇక బ్రహ్మదేవుడు కూడా కాపాడలేడు అనే ప్రచారం జరుగుతుంది. వివేకా హత్య వలన లబ్ధిదారులైన వారిని విచారించడం లేదు అని దస్తగిరి, సునీల్ యాదవ్ అన్నారు కాబట్టి, ఈడీ జగన్ మోహన్ రెడ్డి తలుపు తట్టే అవకాశం ఉన్నదని ఆశించే వారూ ఉన్నారు. మద్యం స్కాంలో రజత్ భార్గవ్‌ను ఈడీ విచారించిన తరువాత ఖచ్చితంగా జగన్ అరెస్ట్ అవుతాడు అనేది అత్యాశ మాత్రమే. అవినాష్ రెడ్డి ఈడీ విచారణకు వెళ్ళినందువలన జగన్ మోహన్ రెడ్డికి వ్యక్తిగతంగా జరిగే నష్టం ఉండదు. వివేకా హత్య కేసులో అంతిమ లబ్ధిదారు అవినాష్ రెడ్డిగానే చూపిస్తారు. అందుకని రక్తపు మరకలు జగన్ దగ్గరకు వెళ్ళవు. ఇక ప్రజాధనం గురించి ఈడీ తన పిటిషన్‌లో చేసిన ప్రస్తావనలో నిజం ఉన్నది కానీ, ఆ సంస్థ పైన విశ్వాసం ఎంతవరకు ఉంచవచ్చో అనేది ప్రశ్న మాత్రమే. జగన్ మోహన్ రెడ్డి పైన ఉన్న ఈడీ కేసుల విచారణ జరిగితే జగన్ మోహన్ రెడ్డి ఇబ్బంది పడతాడు అనేది వాస్తవమే. కానీ ఈడీ వేసిన పిటిషన్ పైన విచారణ జరగడం ఎప్పుడో చూడాలి. కారణం, జగన్ కేసుల్లో వేగవంతమైన విచారణ జరగాలని వేసిన అనేక పిటిషన్ల విచారణే వాయిదాలు పడుతూ వచ్చాయి. వేగవంతమైన విచారణ కోరుతూ పడిన పిటిషన్ల విచారణలోనే జాప్యం జరుగుతుంటే, ఇప్పుడు వచ్చిన పిటిషన్ల వలన కొత్తగా ఏదో జరుగుతుంది అనుకోవడం భ్రమగా మిగిలినా ఆశ్చర్యం లేదు. కారణం జగన్ మోహన్ రెడ్డి పైన ఉన్న సీబీఐ కేసుల్లో వేగవంతమైన విచారణ జరపాలని చేగొండి హరిరామ జోగయ్య పిటిషన్ వేసింది 2023 సంవత్సరంలో. ఇప్పటికీ అది పెండింగులో ఉన్నది. గతంలో ఈడీ కూడా కొన్ని పిటిషన్లు వేసింది. అవన్నీ పెండింగులోనే ఉన్నాయి. ఇప్పుడు కొత్తగా ఈడీ వేసిన పిటిషన్ కూడా వాటితో కలిపి వింటాము అని హైకోర్టు ఇటువంటి పిటిషన్లను లిస్ట్ చేయమని రిజిస్ట్రీని ఆదేశించింది. అక్టోబర్ పదమూడు నాటికి పోస్టు చేసినా విచారణ ముగింపుకు రాలేదు. ఈలోపుగా నాంపల్లి సీబీఐ ప్రత్యేక కోర్టు సీబీఐ కేసులను, ఈడీ కేసులను కలిపి రోజువారీ విచారణ జరపడానికి నిర్ణయాన్ని వెల్లడించింది. కేసుల్లో ఉన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు అందరూ రోజువారీ విచారణకు హాజరవ్వాలని ఆదేశించింది. ముందు డిశ్చార్జ్ పిటిషన్లు వినాలి. గతంలో డిశ్చార్జ్ పిటిషన్ల విచారణ జరిగింది. సరిగ్గా నిర్ణయం వెలువడే ముందు సదరు విచారణ జరిపిన న్యాయమూర్తులు బదిలీ అయ్యారు. ఒక న్యాయమూర్తి అయితే తీర్పు ఇచ్చి వెళ్ళవలసిన పరిస్థితిలో ఉండగా, అనారోగ్య కారణం చూపిస్తూ తీర్పు ఇవ్వకుండా వెళ్లిపోయారు. ఇది న్యాయవ్యవస్థ పైన కొన్ని అనుమానాలను కూడా రేకెత్తించింది. ఇరవై కేసుల్లో చార్జిషీట్లను చదవడానికే చాలా రోజులు పడుతుంది కాబట్టి విచారణకు ఆలస్యమవుతుంది అని చెప్పేవారు కూడా ఉన్నారు. న్యాయమూర్తులకు ఇటువంటి కేసులు వందల్లో వారి ముందుకు వస్తూ ఉంటాయి. వారు ప్రతి రోజూ అంతకంటే ఎక్కువ కాగితాలు తిరగేస్తారు. కానీ కేసులు ముగింపుకు రాలేదు అంటే రాజకీయ కారణాలే ప్రధానం. పది సంవత్సరాలు ఒక నిందితుడు కోర్టుకు హాజరు కాలేదంటే అటువంటి వింతను ఏ ప్రజాస్వామిక దేశమూ చూసి ఉండదు. ఎవరికీ సాధ్యపడదు. ఒక్క జగన్ మోహన్ రెడ్డికి మాత్రమే సాధ్యం. కేసుల్లో తీర్పు ఏదైనా రావచ్చు. కానీ తీర్పే రాకపోవడం మన దేశంలోనే జరుగుతుంది. ప్రజలు జగన్ మోహన్ రెడ్డిని నమ్మడానికి ఆయన మీద ఉన్న కేసుల్లో విచారణ జరగకపోవడం అనేది ఒక ప్రధాన కారణం. ఇప్పుడు కూడా మళ్లీ డిశ్చార్జ్ పిటిషన్లే ముందు విచారణకు వస్తాయి. వాటిపైన సీబీఐ కోర్టు తీర్పు ఇవ్వడానికి ఎన్ని రోజులు పడుతుందో తెలియదు. వాటిపైన పైకోర్టులకు వెళ్లే అవకాశం ఉంటుంది. ఇదంతా వినేటప్పుడు ప్రజలకు ఒకింత నిరాశ కలుగుతుంది. దాని వలన నిర్లిప్తత పెరుగుతుంది. కానీ ఇది ఒక బాధాకరమైన వాస్తవం. ఇప్పుడు కూడా సీబీఐ కోర్టు ఈ నిర్ణయం తీసుకున్న సందర్భం, ఈడీ పిటిషన్ వేసిన సమయం గమనిస్తే ఇది ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల శంఖారావం మోగిన సందర్భం. ఇటువంటి సందర్భంలో జగన్ మోహన్ రెడ్డి రోజువారీ విచారణకు రావలసిందే అని న్యాయస్థానం ఆదేశించగలదా? అది సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధం అని జగన్ తరపు న్యాయవాదులు వాదించడం సహజం. అంటే డిసెంబర్ వరకు జగన్ రోజువారీ విచారణకు రావడం అసంభవం. అందుకని ఇప్పటికిప్పుడు న్యాయస్థానాల నుండి జగన్‌కు వచ్చే ఇబ్బంది లేదు. కానీ రాష్ట్రంలో అనేక విషయాలలో ఈడీ దూకుడు వలన జగన్ సన్నిహితులు విచారణలకు హాజరవడం, అరెస్టులు అవడం మాత్రం జగన్ మోహన్ రెడ్డిని మానసికంగా అస్థిరపరిచే అవకాశం మాత్రం ఉంది. అయితే ఈడీ ఎందుకు జగన్ మానసిక స్థితిని అస్థిరపరచాలని చూస్తున్నది అనేది ఎవరికీ అర్థం కాని విషయం. ఇప్పటివరకు బీజేపీ, జగన్ మోహన్ రెడ్డి మధ్య నడిచిన మైత్రీ బంధం జగమెరిగిన రహస్యం. అలాగే సీబీఐ, ఈడీలు కేంద్రం కనుసన్నల్లోనే నడుస్తాయి అనేది కూడా జగమెరిగిన సత్యమే. దేశంలో ఎవరినైనా తొక్కిపెట్టాలని కేంద్ర ప్రభుత్వం భావించిన తరువాతే రంగప్రవేశం చేసే వ్యవస్థలు అన్నీ జగన్ మోహన్ రెడ్డి పైన మూకుమ్మడిగా దాడి చేస్తున్నాయి. వ్యవస్థలను కేంద్ర ప్రభుత్వం నియంత్రిస్తున్నది అనే అపవాదు నుండి బయటపడి, వ్యవస్థలు తమ స్వతంత్ర ప్రతిపత్తిని నిరూపించుకోవడానికి ఏదో చిన్న ప్రయత్నం చేస్తున్నాయా అనే సందేహం కలుగుతున్నది. ఈ ప్రయత్నం వలన జగన్‌కు, బీజేపీకి పెద్దగా స్పర్థ పెరిగే అవకాశం లేదు. మన చట్టాలలో ఉన్న వెసులుబాటు, న్యాయస్థానాల్లో కేసుల విచారణను జాప్యం చేయగలిగే అవకాశాలు మన సీబీఐ, ఈడీలకు తెలియనివి కావు. ఇప్పుడు సీబీఐ, ఈడీలు రెండూ జగన్ అక్రమాస్తుల కేసుల విచారణ ప్రక్రియ పట్ల శ్రద్ధ చూపిస్తున్నాయి అని ఆంధ్రప్రదేశ్ ప్రజలకు తెలియజేశాయి. ఎలాగూ న్యాయస్థానంలో ఆలస్యం జరుగుతుంది. సీబీఐ కేసులను, ఈడీ కేసులను కూడా రోజువారీ విచారణ ప్రక్రియ మొదలుపెడతాము అని నాంపల్లి సీబీఐ కోర్టు తెలిపింది. రేపు జగన్ మళ్లీ ఒక పిటిషన్ వేస్తాడు. గతంలో సీబీఐ కేసులు తేలిన తరువాతే ఈడీ కేసులు వినాలని జగన్ వేసిన పిటిషన్ లాంటి పిటిషన్లు మరో రకంగా వేస్తాడు. అయితే వ్యవస్థలు నిజంగా పట్టుదలగా జగన్ కేసుల విచారణ పూర్తి చేయాలనుకుంటే మాత్రం జగన్ బయటపడటం కష్టం. కేంద్ర ప్రభుత్వం తమాషా చూస్తూ ఊరుకుంటుందో లేదో చూడాలి. ఇప్పుడు జగన్ కేసులు విచారణకు రావడం కంటే, బీజేపీకి, జగన్ మోహన్ రెడ్డికి మధ్య మైత్రీబంధం తెగిపోయిందా అనే సందేహమే ఏపీ ప్రజలు ఎక్కువగా ఆలోచిస్తున్న విషయం.!

- ఇంద్రాణి

## చరిత్రలో ఈ రోజు

అక్టోబర్ 17

OCT 17

* 1817 : భారతీయ విద్యావేత్త, ఇస్లామీయ సామాజిక సంస్కర్త సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్ జననం (మ.1898).(చిత్రంలో)
* 1920 : భారతీయ కమ్యూనిస్టు పార్టీ తాష్కెంట్ లో ఏర్పడింది.
* 1901 : భారత స్వాతంత్ర్య సమరయోధుడు, వైద్యుడు జి.ఎస్.మేల్కోటే జననం (మ.1982).
* 1929 : కవి, పరిశోధకుడు, విమర్శకుడు కొర్లపాటి శ్రీరామమూర్తి జననం (మ.2011).
* 1940 : గాంధీజీ పిలుపుతో వినోబా భావే 'వ్యక్తి సత్యాగ్రహా'న్ని ఆచరించిన రోజు.



సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్

* 1970 : భారత క్రికెట్ క్రీడాకారుడు అనిల్ కుంబ్లే జననం.
* 1981 : తమిళ కవి, భావకవి కన్నదాసన్ మరణం (జ.1927).
* 1979 : మదర్ థెరీసా కు నోబెల్ శాంతి బహుమతి వచ్చింది.



## వర్షంలోనూ తరగని భక్తి..

### తిరుమలలో వైభవంగా శ్రీవారి గరుడ సేవ

- **నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నేడు గరుడ వాహన సేవ**
- **వర్షాన్నిసైతం లెక్కచేయకుండా పోటెత్తిన లక్షలాది మంది భక్తులు**
- **లక్ష్మీకాసుల మాలతో గరుత్మంతునిపై దర్శనమిచ్చిన మలయప్ప స్వామి**
- **గోవింద నామస్మరణతో మార్మోగిన తిరుమల పురవీధులు**
- **భక్తులకు విస్తృత ఏర్పాట్లు చేసిన టీటీడీ యంత్రాంగం**

కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి వారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో అత్యంత ముఖ్యమైన గరుడ వాహన సేవ శుక్రవారం రాత్రి అత్యంత వైభవంగా, కన్నుల పండువగా జరిగింది. ఉత్సవాల్లో ఐదో రోజైన ఈ పర్వదినాన, స్వామివారికి అత్యంత ప్రీతిపాత్రుడైన గరుత్మంతునిపై మలయప్ప స్వామి వారు ప్రత్యేకమైన లక్ష్మీకాసుల హారంతో అలంకృతులై తిరుమాడ వీధుల్లో విహరించారు. భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా లక్షలాది మంది భక్తులు గోవింద నామస్మరణతో స్వామివారిని దర్శించుకుని భక్తి పారవశ్యంలో మునిగితేలారు. శుక్రవారం రాత్రి 6:30 గంటలకు వాహన సేవ ప్రారంభమైంది. గజరాజుల గంభీర నడకలు, మంగళవాయిద్యాలు, కళాకారుల భజనలు, కోలాటాలు, జీయంగార్ల వేదఘోషల నడుమ గరుడ వాహనంపై శ్రీవారు ముందుకు కదిలారు. అడుగడుగునా భక్తులు కర్పూర హారతులు సమర్పిస్తూ "గోవిందా..గోవిందా.." అంటూ చేసిన జయజయధ్వానాలతో సప్తగిరులు మార్మోగాయి. స్వామివారి దివ్యమంగళ స్వరూపాన్ని కనులారా వీక్షించిన భక్తులు తన్మయత్వం చెందారు.

**వర్షంలోనూ అచంచల విశ్వాసం**

మధ్యాహ్నం నుంచి తిరుమలలో వర్షం కురుస్తున్నప్పటికీ భక్తుల ఉత్సాహం ఏమాత్రం తగ్గలేదు. చిరుజల్లులను సైతం లెక్కచేయకుండా గంటల తరబడి గ్యాలరీల్లో వేచి ఉండి, గరుత్మంతునిపై ఉన్న తమ ఆరాధ్య దైవాన్ని దర్శించుకున్నారు. వర్షంలో వేచి ఉన్న భక్తులకు టీటీడీ అధికారులు అన్నప్రసాదాలు, తాగునీరు, పాలు, బాదంపాలు, అల్పాహారం వంటివి అందించి వారిని ఆదుకున్నారు. టీటీడీ కల్పించిన సౌకర్యాలపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. వైష్ణవ సంప్రదాయంలో గరుడ సేవకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. పక్షిరాజైన గరుడుడు భగవంతునికి నిత్య సేవకుడు, పరమ భక్తుడు. ఆయనపై స్వామివారు విహరించడం భక్తికి, శరణాగతికి ప్రతీక. గరుడ వాహనంపై ఉన్న స్వామివారిని దర్శించుకుంటే సర్వపాపాలు తొలగిపోయి, జ్ఞాన వైరాగ్యాలు సిద్ధిస్తాయని పురాణాలు చెబుతున్నాయి. ఈ అపురూప ఘట్టాన్ని తిలకించడం జన్మ ధన్యమైనట్లుగా భక్తులు భావిస్తారు. ఈ అద్భుతమైన కార్యక్రమంలో తిరుమల జీయర్ స్వాములు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు, జేఈవోలు డా. ఎ. శరత్, ప్రభల గోపీనాథ్, సీవీఎస్వో మురళీకృష్ణ, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పుంగనూరు ఘటన..

### మిథున్‌రెడ్డి 100 మందితో వచ్చారు: అన్నమయ్య ఎస్పీ

పుంగనూరు: మున్సిపల్ ఎన్నికల నామినేషన్ కేంద్రానికి ఎంపీ మిథున్‌రెడ్డి దాదాపు 100 మంది అనుచరులతో కలిసి వచ్చారని అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ తెలిపారు. ఇవాళ ఉదయం పుంగనూరులో చోటు చేసుకున్న ఉద్రిక్తతపై ఆయన స్పందించారు. నామినేషన్ వేసే అభ్యర్థితోపాటు మరో ఇద్దరికి మాత్రమే కేంద్రం వద్దకు అనుమతి ఉందని, వంద మీటర్ల దూరం నిబంధనలను కూడా మిథున్‌రెడ్డి ఉల్లంఘించి గేట్లను వాహనాలతో ఢీ కొట్టారని చెప్పారు. ఈ ఘటనపై తెదేపా అభ్యర్థులు, స్థానికులు నిరసన తెలిపారని, ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగితే పోలీసులు చెదరగొట్టారని మీడియాకు తెలిపారు. "నామినేషన్ కేంద్రంలోకి ఒక వాహనం అతివేగంగా వచ్చింది. నామినేషన్ కేంద్రంలోని అభ్యర్థులు, ప్రజలపైకి దూసుకెళ్లింది. కొందరికి గాయాలైతే ఆస్పత్రికి తరలించాం. ఎవరైనా చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుంటే కఠినంగా శిక్షిస్తాం" అని ఎస్పీ హెచ్చరించారు. రౌడీయిజం చేస్తామంటే.. చూస్తూ ఊరుకోం: మంత్రి డీఎస్‌బీవీ స్వామి పుంగనూరు, తిరుపతి ఘటనల్లో వైకాపా తీరుపై మంత్రి డీఎస్‌బీవీ స్వామి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఓటమి తప్పదని



ముందే గ్రహించి.. గొడ్డలి పార్టీ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తోందని విమర్శించారు. మిథున్‌రెడ్డి వందలాదిమందితో నామినేషన్ కేంద్రంలోకి వెళ్లడమేంటని ప్రశ్నించారు. గొడ్డలి పార్టీ నాయకులు రౌడీయిజం చేస్తామంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. అలజడులు సృష్టించాలని ప్రయత్నిస్తే.. చర్యలు తప్పవన్నారు. ఏ ఎన్నికలైనా కూటమి ప్రభంజనం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

# సాయికృష్ణ కేసులో కీలక పరిణామం.. ఏపీ హైకోర్టు కీలక ఉత్తర్వులు

- గాదె సాయికృష్ణ కస్టోడియల్ టార్చర్ కేసు సీబీఐకి బదిలీ
- విచారణను సీబీఐకి అప్పగిస్తూ ఏపీ హైకోర్టు ఉత్తర్వులు
- బాధితుడి తల్లికి రూ.25 లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశం
- రాష్ట్ర పోలీసుల విచారణపై అనుమానాలు వ్యక్తం చేసిన న్యాయస్థానం
- పోలీసులే మృతదేహాన్ని మాయం చేశారన్న ఆరోపణల నేపథ్యంలో తీర్పు

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన గాదె సాయికృష్ణ కస్టోడియల్ టార్చర్ కేసులో ఏపీ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ కేసు దర్యాప్తును కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) కి బదిలీ చేస్తూ నేడు ఉత్తర్వులు జారీ చేసింది. అంతేగాక బాధితుడి తల్లికి నాలుగు వారాల్లోగా రూ.25 లక్షల పరిహారం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. వివరాల్లోకి వెళితే.. కొన్ని నాన్‌బెయిలబుల్ వారెంట్ల కేసులో 25 ఏళ్ల సాయికృష్ణను 2026 మే నెలలో మార్కాపురం సమీపంలో టాస్క్ ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం విజయవాడలోని కృష్ణలంక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అయితే, అతడిని మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచకపోగా, ఆ తర్వాత అతని ఆచూకీ గల్లంతైంది. దీంతో సాయికృష్ణ తల్లి గాదె విజయలక్ష్మి హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసుపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (SIT) విచారణ జరిపి, మే 6 నుంచి 8 మధ్య కస్టడీలో జరిగిన చిత్రహింసల వల్లే సాయికృష్ణ మరణించినట్లు నిర్ధారించింది.




అక్రమ నిర్బంధం, సీసీటీవీ ఫుటేజ్ డిలీట్ చేయడం, మృతదేహాన్ని రహస్యంగా మాయం చేయడం వంటి ఆరోపణలతో అప్పటి సీఐతో సహా పలువురు పోలీసు సిబ్బందిని అరెస్ట్ చేసి, చార్జిషీట్ కూడా దాఖలు చేశారు. అయితే, రాష్ట్ర పోలీసుల విచారణ నిష్పక్షపాతంగా జరగడం లేదని, కేసును సీబీఐకి అప్పగించాలని సాయికృష్ణ తల్లితో పాటు మరికొందరు హైకోర్టులో పిటిషన్లు వేశారు. ఈ పిటిషన్లపై విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం, సమగ్ర దర్యాప్తు అవసరమని భావించి కేసును సీబీఐకి బదిలీ చేస్తున్నట్లు స్పష్టం చేసింది. గతంలో సుప్రీంకోర్టు కూడా ఈ కేసు విచారణను పర్యవేక్షిస్తూ, ఎఫ్ఐఆర్ నమోదులో జాప్యం, సాక్ష్యాలు మాయం కావడంపై ప్రశ్నలు లేవనెత్తడం గమనార్హం.

## గుంటూరు కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో
# 58 కేజీల భారీ లడ్డు అందజేత



ప్రముఖ వ్యాపారవేత్త బైసాని కిరణ్ కుమార్ శుక్రవారం కన్యకా పరమేశ్వరి అమ్మవారికి 58 కేజీల భారీ లడ్డును అందజేశారు. గత 20 సంవత్సరాలుగా ఈ దేవస్థానంలో నవరాత్రి వేడుకలలో కిరణ్ కుమార్ మూలా నక్షత్రం రోజున 58 కేజీల లడ్డును అందజేస్తున్నారు. ఆలయ ఉత్సవ కమిటీ ఛైర్మన్ కోటా శేషగిరి సభ్యులు కండే రాజేష్ కు, బైసాని కిరణ్, వెచ్చా కృష్ణమూర్తి తో కలిసి ఈ లడ్డును అందజేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా బైసాని కిరణ్ మాట్లాడుతూ.. గత రెండు దశాబ్దాలుగా కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో భారీ లడ్డును అందజేయటం వల్ల, భక్తులకు శుభ యోగాలు కల్గుతాయన్నారు. వెచ్చా కృష్ణమూర్తి మాట్లాడుతూ.. నవరాత్రి వేడుకలు నిర్వహణ అద్భుతంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఇందువతి భావన హర్షవర్ధన్, బైసాని సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# సి.ఆర్. ఫౌండేషన్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు





చంద్ర రాజేశ్వరరావు (సి.ఆర్) ఫౌండేషన్ ఆధ్వర్యంలోని మహిళా సంక్షేమ కేంద్రంలో వృత్తి విద్యా శిక్షణ పొందుతున్న విద్యార్థినులు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. దసరా పండుగను పురస్కరించుకుని విద్యార్థినులు వివిధ రకాల పూలతో సంప్రదాయబద్ధంగా అందమైన బతుకమ్మలను తీర్చిదిద్దారు. అనంతరం బతుకమ్మ చుట్టూ చేరి జానపద గీతాలు ఆలపిస్తూ, లయబద్ధమైన నృత్యాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంక్షేమ కేంద్రం డైరెక్టర్ జోస్యభట్ల కల్పన, సి.ఆర్. ఫౌండేషన్ ఉపాధ్యక్షురాలు మరియు సి.ఆర్. పాలిక్లినిక్ డయాగ్నస్టిక్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ కూనంనేని రజిని, కమిటీ సభ్యులు వి. లలిత, కృష్ణప్రియ పాల్గొన్నారు. అలాగే ఉపాధ్యాయినులు తన్వీర్ బేగం, నజీర, స్రవంతిలతో పాటు వృద్ధాశ్రమ వాసులు మాధవి, లైలా, జ్యోత్స్న, జ్యోతి తదితరులు హాజరయ్యారు. విద్యార్థినుల ఆటపాటలతో ఫౌండేషన్ ప్రాంగణమంతా పండుగ సందడి నెలకొంది.

# రాయలసీమలో ఎన్నికల ఉద్రిక్తతలు..
## ఈసీకి ఫిర్యాదు చేసిన టీడీపీ

- స్థానిక ఎన్నికల నామినేషన్ల వేళ రాయలసీమలో ఘర్షణలు
- వైసీపీ నేతలు దౌర్జన్యాలకు పాల్పడ్డారంటూ రాష్ట్ర ఎన్నికల సంఘానికి టీడీపీ ఫిర్యాదు
- పుంగనూరులో ఎంపీ మిథున్‌రెడ్డి దాడులకు పాల్పడ్డారని ఆరోపణ
- ఘటనలకు సంబంధించిన వీడియో ఆధారాలను ఈసీకి సమర్పించిన నేతలు
- అధికారులను భయపెడుతున్నారని పెద్దిరెడ్డి కుటుంబంపై ఫిర్యాదు



ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ రాయలసీమలో తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. పలు ప్రాంతాల్లో వైసీపీ నేతలు, కార్యకర్తలు దాడులకు పాల్పడుతూ, ప్రతిపక్షాలను నామినేషన్లు వేయకుండా అడ్డుకుంటున్నారని ఆరోపిస్తూ టీడీపీ రాష్ట్ర ఎన్నికల సంఘానికి (ఎస్ఈసీ) ఫిర్యాదు చేసింది. ఈ మేరకు టీడీపీ సీనియర్ నేతలు వర్ల రామయ్య, అశోక్‌బాబు తదితరులు శుక్రవారం ఎస్ఈసీ కార్యాలయానికి వెళ్లి ఎన్నికల కమిషనర్‌ను కలిశారు. రాయలసీమలోని పుంగనూరు, రాయచోటి, ధర్మవరం, తిరుపతి నియోజకవర్గాల్లో వైసీపీ విధ్వంసం సృష్టించిందంటూ వారు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ముఖ్యంగా అన్నమయ్య జిల్లా పుంగనూరులో వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి స్వయంగా దాడులకు పాల్పడ్డారని వారు తీవ్ర ఆరోపణలు చేశారు. పుంగనూరు మున్సిపల్ ఎన్నికల నామినేషన్ కేంద్రం వద్ద ఎంపీ మిథున్‌రెడ్డి, ఆయన అనుచరులు టీడీపీ కార్యకర్తలు, ప్రజలపైకి కాన్వాయ్‌తో దూసుకెళ్లి భయానక వాతావరణం సృష్టించారని వర్ల రామయ్య ఆరోపించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో దృశ్యాలను వారు ఎన్నికల సంఘానికి ఆధారాలుగా సమర్పించారు. పెద్దిరెడ్డి కుటుంబం అధికారులను భయభ్రాంతులకు గురి చేస్తూ ప్రజాస్వామ్య ప్రక్రియను అపహాస్యం చేస్తోందని టీడీపీ నేతలు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. వైసీపీ నేతల దౌర్జన్యాలపై తక్షణమే విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలని వారు ఎన్నికల సంఘాన్ని కోరారు. ఈ ఫిర్యాదుతో రాయలసీమలో స్థానిక ఎన్నికల రాజకీయాలు మరింత వేడెక్కాయి.

# పతకాల పంట పండించిన డి.ఎస్.కె సాయి కరాటే అకాడమీ విద్యార్థులు







తిరుపతి: ప్రకాశం జిల్లా కనిగిరిలో ఇటీవల నిర్వహించిన జుజిట్సు రాష్ట్ర స్థాయి కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో తిరుపతి దొడ్డాపురం వీధికి చెందిన డి.ఎస్.కె సాయి కరాటే అకాడమీ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. అండర్ 8, అండర్ 12 విభాగాల్లో బి. తీక్షణ స్వర్ణ, రజత పతకాలు కైవసం చేసుకోగా, డి. ఈర్షితశ్రీ రెండు ఈవెంట్లలోనూ కాంస్య పతకాలు గెలుచుకుంది. అలాగే అండర్ 14 విభాగంలో డి. విష్ణుప్రియ, డి. విద్యాశ్రీలు స్వర్ణ, రజత పతకాలు సాధించి సత్తా చాటారు. ఎఫ్.ఆర్.టి.ఐ (FRTI) స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్, సీనియర్ కోచ్ డాక్టర్ కరాటే డి.సి.ఎస్ రాయల్ శిక్షణలో విద్యార్థులు ఈ ఘనత సాధించడం పట్ల తిరుపతి రాయలసీమ జోనల్ ఎఫ్.ఆర్.టి.ఐ కార్యాలయంలో అభినందన సభ (సక్సెస్ మీట్) నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎఫ్.ఆర్.టి.ఐ జాతీయ సంయుక్త కార్యదర్శి కుప్పాల అజయ్ ప్రసన్న కుమార్, విశ్వతేజ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ జి. రమేష్ బాబు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎస్.కె. ముబారక్ బాషా, యాష్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ రమ్య, రోబోటిక్స్ నిపుణులు టి. లోకేష్ హాజరయ్యారు. విజేతలైన క్రీడాకారులకు మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ.. విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లోనూ పాల్గొని పతకాలు సాధించి రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. నేటి సమాజంలో ఆడపిల్లలకు ఆత్మరక్షణ (సెల్ఫ్ డిఫెన్స్) ఎంతో అవసరమని, వారికి అత్యుత్తమ శిక్షణనిస్తూ ఛాంపియన్లుగా తీర్చిదిద్దుతున్న డాక్టర్ కరాటే డి.సి.ఎస్ రాయల్ సేవలను కొనియాడారు. అనంతరం కోచ్ డి.సి.ఎస్ రాయల్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# రాయచోటిలో వేడెక్కిన రాజకీయం.. శ్రీకాంత్‌రెడ్డికి సవాల్ విసిరిన మంత్రి మండిపల్లి



రాయచోటి నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిపై దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలని మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సవాల్ విసిరారు. నేను చేసిన పనులు నేరుగా ప్రజల ముందే చూపిస్తా.. గతంలో నువ్వు చేసిన పనులేంటో చూపించే దమ్ముందా? అని ఆయన ప్రశ్నించారు. రాయచోటిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, గత ప్రభుత్వ తీరును ఎండగడుతూ, తమ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులను గణాంకాలతో సహా వివరించారు. గత 25 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. రూ.450 కోట్లతో జల్ జీవన్ మిషన్ కింద ఆరు మండలాలకు తాగునీటి ప్రాజెక్టు, రూ.420 కోట్ల అంచనాతో 25 వేల ఎకరాలకు సాగునీరందించే శ్రీనివాసపురం రిజర్వాయర్ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. గత వైసీపీ ప్రభుత్వం అమృత్ పథకం నిధులను వెనక్కి పంపించిందని ఆయన విమర్శించారు. ఎన్నికలు రాగానే శ్రీకాంత్‌రెడ్డి కార్యకర్తల పేరుతో చిల్లర రాజకీయాలు చేస్తున్నారని మంత్రి మండిపడ్డారు. వైసీపీ శ్రేణులను రెచ్చగొట్టి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. “అధికారం కోల్పోయాక రాయచోటి మొహం చూడని వ్యక్తి ఇప్పుడు నీతులు చెబుతున్నారు. నీకు దమ్ముంటే రానున్న 40 రోజులు ఇక్కడే ఉండి కార్యకర్తలకు అండగా నిలబడు” అని సవాల్ చేశారు. తాను 22 ఏళ్లుగా ప్రజల్లో ఉంటూ కష్టపడి ఈ స్థాయికి వచ్చానని, ఎవరి కాళ్లూ పట్టుకోలేదని రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు.



# పుంగనూరు ఘటన..
## డ్రోన్ వీడియోల్లో విస్తుపోయే వాస్తవాలు

పుంగనూరు: అన్నమయ్య జిల్లా పుంగనూరులో వైకాపా వర్గీయుల దౌర్జన్యంపై పోలీసులకు సాక్ష్యాధారాలు లభించాయి. పోలీసులకు లభించిన డ్రోన్ వీడియోల్లో విస్తుపోయే వాస్తవాలు వెలుగు చూశాయి. పోలీసులు సేకరించిన వీడియో ఆధారాల ప్రకారం.. మొదట తెదేపా నేతలు, కార్యకర్తలపై ఎంపీ మిథున్‌రెడ్డి తన అనుచరులతో దాడి చేయించారు. కర్రలు, రాళ్లు, మారణాయుధాలతో దాడులకు తెగబడ్డారు. ఈ వీడియోలను సేకరించిన పోలీసులు.. ఆ దిశగా దర్యాప్తు ప్రారంభించారు. దాడులు చేసిన వారిని గుర్తించేపనిలో ఉన్నారు.

# జేసీ ప్రభాకర్ రెడ్డి వర్గానికి వార్నింగ్... కేతిరెడ్డి పెద్దారెడ్డిపై కేసు నమోదు.. వేడెక్కిన తాడిపత్రి

అనంతపురం జిల్లా తాడిపత్రిలో రాజకీయాలు మరోసారి వేడెక్కాయి. మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత కేతిరెడ్డి పెద్దారెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో రెచ్చగొట్టేలా, బెదిరింపులకు పాల్పడేలా ఆయన వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ తెలుగుదేశం పార్టీ తాడిపత్రి పట్టణ అధ్యక్షుడు హాజీ బాషా పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్తే, మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల సందర్భంగా పెద్దారెడ్డి తన ప్రత్యర్థి జేసీ ప్రభాకర్ రెడ్డి వర్గాన్ని ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వైసీపీ తరపున మున్సిపల్ ఛైర్‌పర్సన్ అభ్యర్థిగా ఫయాజ్ బాషాను బరిలోకి దింపుతున్నట్టు ఆయన ప్రకటించారు. ఈ సందర్భంగా తన రాజకీయ ప్రత్యర్థి, టీడీపీ నేత జేసీ ప్రభాకర్ రెడ్డిపై ఆయన తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. జేసీ ప్రభాకర్ రెడ్డి, ఆయన అనుచరులు తమ పార్టీ అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా బెదిరిస్తున్నారని కేతిరెడ్డి ఆరోపించారు. తనను తాడిపత్రి రాకుండా అడ్డుకునే ప్రయత్నం చేశారని, కోర్టు అనుమతితో రావాల్సి వచ్చిందని గుర్తుచేశారు. “నేను వచ్చినప్పటి నుంచి నా చిటికెన వేలు వెంట్రుక కూడా పీకలేకపోయారు. అధికారం శాశ్వతం కాదు, ఈ విషయం ప్రభాకర్ రెడ్డి అనుచరులు, ఆయనకు మద్దతిచ్చే అధికారులు గుర్తుంచుకోవాలి. నాతో పెట్టుకుంటే ప్రతీకారం తీర్చుకుంటా” అని ఆయన గట్టిగా హెచ్చరించారు. ఈ వ్యాఖ్యలనే ఆధారంగా తీసుకుని, టీడీపీ నేత హాజీ బాషా పోలీసులకు ఫిర్యాదు చేశారు. పెద్దారెడ్డి



వ్యాఖ్యలు శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. హాజీ బాషా ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు పెద్దారెడ్డిపై బీఎన్ఎస్ 192, 351(2), 223 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎన్నికల వేళ ఈ ఘటన తాడిపత్రిలో రాజకీయ ఉద్రిక్తతలను మరింత పెంచింది.

# ఇంద్రకీలాద్రికి భక్తజన సంద్రం.. సరస్వతీ దేవిగా కనకదుర్గమ్మ!

- **మూలా నక్షత్రం సందర్భంగా ఇంద్రకీలాద్రికి పోటెత్తిన భక్తులు**
- **సరస్వతీ దేవి అలంకారంలో దర్శనమిచ్చిన కనకదుర్గమ్మ**
- **రద్దీ కారణంగా అన్ని వీఐపీ, సిఫార్సు దర్శనాలు రద్దు**
- **సాయంత్రం అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్న సీఎం చంద్రబాబు**
- **భక్తుల కోసం ఐదంచెల భద్రతతో పటిష్ఠ ఏర్పాట్లు**

విజయవాడ ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజైన శుక్రవారం, అమ్మవారి జన్మనక్షత్రమైన 'మూలా నక్షత్రం' కావడంతో కనకదుర్గమ్మ దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఈ పవిత్రమైన రోజున అమ్మవారు జ్ఞాన ప్రదాయిని అయిన శ్రీ సరస్వతీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. తెల్లవారుజాము నుంచే భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో ఇంద్రకీలాద్రి పరిసరాలు జనసంద్రంగా మారాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అధికారులు వీఐపీ బ్రేక్ దర్శనాలతో పాటు అన్ని రకాల సిఫార్సు దర్శనాలను పూర్తిగా రద్దు చేశారు. మూలా నక్షత్రం సందర్భంగా క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులందరికీ కేవలం ఉచిత దర్శనం మాత్రమే కల్పిస్తున్నారు. రద్దీని నియంత్రించేందుకు పోలీసులు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. మూడు చోట్ల హోల్డింగ్



పాయింట్లను ఏర్పాటు చేసి, ఐదంచెల భద్రత నడుమ భక్తులను క్రమపద్ధతిలో క్యూలైన్లలోకి అనుమతిస్తున్నారు. జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ ఎప్పటికప్పుడు సాంకేతికత సాయంతో ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ సిబ్బందికి తగిన సూచనలు జారీ చేస్తున్నారు. నేటి సాయంత్రం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. అశ్వయుజ శుద్ధ సప్తమి, మూలా నక్షత్రం రోజున అమ్మవారిని సరస్వతీ దేవి రూపంలో పూజించడం వల్ల విద్య, జ్ఞానం, బుద్ధికుశలత సిద్ధిస్తాయని పండితులు చెబుతున్నారు. మరోవైపు, శ్రీశైల మహాక్షేత్రంలో భ్రమరాంబికా దేవి ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజున కాత్యాయని అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు.

## ఏపీలో పలు జిల్లాలకు వర్ష సూచన

- **రాష్ట్రంలో రానున్న నాలుగు రోజులు వర్షా లు కురిసే అవకాశం**
- **పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన ఓ మోస్తరు వర్షా లు**
- **కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు జల్లులు పడతాయని అంచనా**
- **ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ సూచన**

ఆంధ్రప్రదేశ్‌లో రానున్న నాలుగు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉరుములు,



మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. విపత్తుల నిర్వహణ సంస్థ అంచనా ప్రకారం.. విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. అదేవిధంగా శ్రీకాకుళం, పోలవరం, విశాఖపట్నం, కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, నంద్యాల, శ్రీ సత్యసాయి జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీఎస్‌డీఎంఏ తెలిపింది. వర్షాల నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచించారు. ముఖ్యంగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తున్న సమయంలో చెట్ల కింద లేదా బహిరంగ ప్రదేశాల్లో ఉండరాదని హెచ్చరించారు. సురక్షితమైన భవనాల్లో ఆశ్రయం పొందాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

## కాక్రోచ్ పార్టీకి జగన్ మద్దతు.. అసలు అజెండా స్పష్టమవుతోందన్న పీవీఎన్ మాధవ్

- **అవినీతి కేసుల్లో ఉన్న జగన్‌తో సీజేపీ కలవడం విడ్డూరమన్న మాధవ్**
- **గతంలో జగన్ పాలనలో మత విద్వేషాలు రెచ్చగొట్టారని ఆరోపణ**
- **విధ్వంసక శక్తులతో జగన్ చేతులు కలిపారని తీవ్ర వ్యాఖ్యలు**
- **ప్రజలు తగిన సమయంలో ప్రజాస్వామ్యబద్ధంగా తీర్పు ఇస్తారని వ్యాఖ్య**
- **ప్రజాస్వామ్యం గురించి జగన్ మాట్లాడటం హాస్యాస్పదమన్న కిలారి దిలీప్**

వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై ఆంధ్రప్రదేశ్ బీజేపీ నేతలు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. విభజనవాద శక్తులతో జగన్ చేతులు కలిపి తన నిజస్వరూపాన్ని బయటపెట్టుకున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఆరోపించారు. కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నేతలకు జగన్ మద్దతు ప్రకటించడాన్ని ఆయన తప్పుబట్టారు. అవినీతికి వ్యతిరేకంగా పోరాడతామని, ప్రజాస్వామ్యాన్ని కాపాడతామని చెప్పుకునే సీజేపీ, అవినీతి ఆరోపణలతో ఈడీ, సీబీఐ



కేసులను ఎదుర్కొంటున్న జగన్‌తో చేతులు కలపడం వారి అసలు ఉద్దేశాలను బయటపెట్టిందని మాధవ్ అన్నారు. గతంలో తన పాలనలో దేవాలయాల కూల్చివేతలు, రథాల దగ్ధం, విగ్రహాల ధ్వంసం వంటి చర్యలతో మత విద్వేషాలు రెచ్చగొట్టారని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను దెబ్బతీశారని ఆయన ఆరోపించారు. ఇప్పుడు రాజకీయ లబ్ధి కోసం అలాంటి శక్తులతో పొత్తు పెట్టుకున్నారని విమర్శించారు. ప్రశాంత నిరసన ప్రజాస్వామ్య హక్కు అని, కానీ హింస, రాళ్లదాడి, పోలీసులపై దాడులకు ప్రజాస్వామ్యంలో చోటు లేదని మాధవ్ స్పష్టం చేశారు. చట్టాన్ని అమలు చేస్తున్న పోలీసుల చర్యలను వక్రీకరించి రాజకీయ లబ్ధి పొందాలని మాజీ ముఖ్యమంత్రి చూడటం విచారకరమని అన్నారు. ప్రజాస్వామ్యం పేరుతో అస్థిరత, విధ్వంసం సృష్టించాలని చూస్తున్న శక్తులతో జగన్ చేస్తున్న రాజకీయ ప్రయత్నాలను రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని, తగిన సమయంలో ప్రజాస్వామ్యబద్ధంగా తమ తీర్పును ఇస్తారని మాధవ్ పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర మీడియా ఇన్‌చార్జ్ కిలారి దిలీప్ వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మధ్య బలపడుతున్న బంధంపై విమర్శలు గుప్పించారు. ఈడీ, సీబీఐ వంటి దర్యాప్తు సంస్థల కేసుల్లో ఉన్న జగన్‌తో కాంగ్రెస్ చేతులు కలపడం "విడ్డూరంగా" ఉందని వ్యాఖ్యానించారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న జగన్ ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం హాస్యాస్పదమని ఆయన ఎద్దేవా చేశారు. మరోవైపు, కాంగ్రెస్ పార్టీ గతంలో బోఫోర్స్, 2జీ స్పెక్ట్రమ్, కామన్వెల్త్ గేమ్స్ వంటి అనేక కుంభకోణాల్లో కూరుకుపోయిందని దిలీప్ గుర్తుచేశారు. అలాంటి పార్టీలు ఇప్పుడు బీజేపీపై 'ఓట్ల దొంగతనం' అంటూ విమర్శలు చేయడం సరికాదన్నారు. ఓటర్ల జాబితా సవరణ అనేది మరణించిన, శాశ్వతంగా వలస వెళ్లిన, నకిలీ ఓట్లను తొలగించేందుకేనని, దీనికి రాజకీయ రంగు పులమడం తగదని హితవు పలికారు. వైసీపీ, కాంగ్రెస్ పార్టీల రాజకీయ వైఖరిని ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని, సరైన సమయంలో వారే తీర్పు ఇస్తారని దిలీప్ పేర్కొన్నారు.

## దసరా రద్దీ దృష్ట్యా 7 వేల ప్రత్యేక బస్సులు నడుపుతున్నాం
## తెలంగాణ ఆర్టీసీ ఎండీ

- **రేపటి నుంచి ఈ నెల 19వ తేదీ వరకు అదనపు బస్సులు**
- **పండుగ అనంతరం రద్దీ దృష్ట్యా ప్రత్యేక సర్వీసులు సిద్ధం చేసినట్లు వెల్లడి**
- **ప్రత్యేక సర్వీసుల వివరాల కోసం టోల్ ఫ్రీ నెంబర్లలో సంప్రదించాలని సూచన**



దసరా పండుగ వేళ ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్‌ఆర్టీసీ) భారీ ఏర్పాట్లు చేసింది. పండుగ పూట సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సు సర్వీసులను అందుబాటులోకి తీసుకువస్తోంది. దసరా రద్దీని దృష్టిలో ఉంచుకుని 7 వేల ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి వెల్లడించారు. దసరా పర్వదినం సందర్భంగా రద్దీ కొనసాగుతున్న దృష్ట్యా రేపటి నుంచి 19వ తేదీ వరకు అదనపు బస్సులు నడపాలని ఆర్టీసీ ఎండీ అధికారులను ఆదేశించారు. అలాగే పండుగ అనంతరం సొంత ఊళ్ల నుంచి నగరానికి, ఇతర ప్రాంతాలకు తిరుగు ప్రయాణమయ్యే వారి కోసం పెద్ద ఎత్తున ప్రత్యేక సర్వీసులను సిద్ధం చేసినట్లు వెల్లడించారు. ప్రయాణికులు తమ టికెట్లను సంస్థ అధికారిక వెబ్‌సైట్ tgsrtcbus.in ద్వారా ముందస్తుగా బుక్ చేసుకోవచ్చని అధికారులు సూచించారు. ప్రత్యేక సర్వీసులకు సంబంధించిన ఇతర వివరాల కోసం 04069440000, 04023450033 నంబర్లలో కాల్ సెంటర్లను సంప్రదించాలని కోరారు.

## ఖైరతాబాద్ ఉపఎన్నికలో బలమైన అభ్యర్థిని నిలబెడతాం: కవిత

- **ఖైరతాబాద్ ఉపఎన్నికలో తమ పార్టీ కచ్చితంగా పోటీ చేస్తుందన్న కవిత**
- **రేవంత్ పాలన పక్కన పెట్టేశారని విమర్శ**
- **రాబోయే ఏడెనిమిది నెలల పాటు ప్రజల్లోనే ఉంటామని వెల్లడి**

తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఖైరతాబాద్ అసెంబ్లీ ఉపఎన్నికపై స్పందించారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికలో తమ పార్టీ కచ్చితంగా పోటీ చేస్తుందని, బలమైన అభ్యర్థిని నిలబెడతామని ఆమె ప్రకటించారు. దసరా రోజున ఒక ఎమ్మెల్సీ అభ్యర్థిని కూడా ప్రకటిస్తామని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి పాలనను పక్కనపెట్టి రాజకీయాలపైనే దృష్టి సారిస్తున్నారని కవిత ఆరోపించారు. రాష్ట్రంలో రైతులు కరవుతో అల్లాడుతుంటే, ముఖ్యమంత్రి మాత్రం గోవా, ఢిల్లీ పర్యటనల్లో బిజీగా ఉన్నారని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు రాబోయే ఏడెనిమిది నెలల పాటు ప్రజల్లోనే ఉండి క్షేత్రస్థాయిలో పోరాడతామని కవిత స్పష్టం చేశారు. నవంబర్ చివరి వరకు రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్‌ను నిరంతరాయంగా అందించాలని డిమాండ్ చేశారు. మేడిగడ్డ బ్యారేజీ పనులను వెంటనే పునరుద్ధరించి పూర్తి చేయాలని కోరారు. పారదర్శకత కోసం ఇకపై అన్ని ఎన్నికలను ఈవీఎంలకు బదులుగా బ్యాలెట్ పేపర్లతోనే నిర్వహించాలని ఆమె



డిమాండ్ చేశారు. గ్లోబల్ సమ్మిట్‌పై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయకపోతే అడ్డుకుంటామని హెచ్చరించారు.

## డిండి ప్రాజెక్టు రద్దు చేయకపోతే ఉద్యమమే

: **డీకే అరుణ హెచ్చరిక**
- **పాలమూరు నీటిని డిండికి తరలించి రైతులను మోసం చేస్తున్నారని డీకే అరుణ ఆరోపణ**
- **జిల్లాకు మేలు చేయనప్పుడు రేవంత్ రెడ్డికి సీఎం పదవి ఎందుకని ప్రశ్న**
- **పదేళ్లలో ఆర్డీఎస్‌కు కేసీఆర్ చేసిందేమీ లేదని విమర్శ**

డిండి ఎత్తిపోతల పథకాన్ని వెంటనే రద్దు చేయాలని బీజేపీ ఎంపీ డీకే అరుణ డిమాండ్ చేశారు. పాలమూరు రైతులకు కేటాయించిన నీటిని డిండికి తరలించి, స్థానిక రైతుల ప్రయోజనాలకు నష్టం కలిగించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆమె తీవ్రంగా ఆరోపించారు. ఈ ప్రాజెక్టును రద్దు చేయని పక్షంలో జిల్లా వ్యాప్తంగా బీజేపీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని ఆమె హెచ్చరించారు. మహబూబ్‌నగర్‌లో పాలమూరు రంగారెడ్డి పెండింగ్ ప్రాజెక్టులపై బీజేపీ ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో డీకే అరుణ మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. జిల్లా ప్రజలకు మేలు చేయని సీఎం కుర్చీ రేవంత్ రెడ్డికి ఎందుకు?



అని ఆమె ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టు డిజైన్‌లో మార్పులు చేయడం ద్వారా రైతులను మోసం చేస్తున్నారని విమర్శించారు. గతంలో పదేళ్లు అధికారంలో ఉన్న కేసీఆర్... ఆర్డీఎస్ కోసం చేసిందేమీ లేదని డీకే అరుణ దుయ్యబట్టారు. రైతులు, అసంపూర్తిగా ఉన్న నీటిపారుదల ప్రాజెక్టుల విషయంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి కొరవడిందని ఆరోపించారు. పాలమూరు జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులన్నింటినీ తక్షణమే పూర్తి చేయాలని ఆమె డిమాండ్ చేశారు. పాలమూరు రైతుల నీటి హక్కులను కాపాడేందుకు బీజేపీ ఎల్లప్పుడూ పోరాడుతుందని స్పష్టం చేశారు.

## రాహుల్ తాటాకు చప్పుళ్లకు భయపడం: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

- **కేంద్ర ప్రభుత్వాన్ని కూల్చేందుకు విపక్షాలు కుట్ర చేస్తున్నాయని ఆరోపణ**
- **పది నెలల్లో మోదీ సర్కార్ పడిపోతుందని దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శ**
- **2029 వరకు మోదీ ప్రధానిగా ఉండాలని ప్రజలు తీర్పు ఇచ్చారని వ్యాఖ్య**

కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు ప్రతిపక్షాలు కుట్రలు పన్నుతున్నాయని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి తీవ్రంగా



ఆరోపించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలను ఆయన "తాటాకు చప్పుళ్లు"గా అభివర్ణించారు. ప్రజాతీర్పును గౌరవించకుండా, దేశంలో అరాచకాన్ని సృష్టించి ప్రభుత్వాన్ని కూలదోయాలని విపక్షాలు పగటి కలలు కంటున్నాయని ఆయన ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామ్య హక్కులను ప్రతిపక్షాలు దుర్వినియోగం చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. "పది నెలల్లో మోదీ ప్రభుత్వం కూలిపోతుంది" అంటూ కొన్ని పార్టీలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండించిన ఆయన, ఇది ప్రజాతీర్పును అవమానించడమేనని పేర్కొన్నారు. "ప్రధానిగా నరేంద్ర మోదీ 2029 వరకు కొనసాగాలని ప్రజలు స్పష్టమైన తీర్పునిచ్చారు. అయితే, బంగ్లాదేశ్, శ్రీలంక వంటి దేశాల్లో ప్రభుత్వాలను మార్చినట్లుగా ఇక్కడ కూడా చేయాలని ప్రతిపక్షాలు దింపుడుకల్లం ఆశలతో ఉన్నాయి. వారి ఆశలు ఎప్పటికీ నెరవేరవు" అని కిషన్‌రెడ్డి విమర్శించారు. ప్రపంచ దేశాలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నప్పటికీ, ప్రధాని మోదీ నాయకత్వంలో భారతదేశం స్థిరంగా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని ఆయన గుర్తుచేశారు. ప్రభుత్వ పనితీరును చూసి ఓర్వలేకే ప్రతిపక్షాలు ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. రాహుల్ గాంధీ చేసే తాటాకు చప్పుళ్లకు మోదీ ప్రభుత్వం భయపడదని, తమ ప్రభుత్వం అత్యంత స్థిరంగా ఉందని, పూర్తికాలం కొనసాగుతుందని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు.

## సికింద్రాబాద్‌లో కేజేఆర్ గార్డెన్ కూల్చివేత

- **సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లోని కేజేఆర్ గార్డెన్ కూల్చివేత**
- **అక్రమ ఫంక్షన్ హాల్‌గా నిర్మించారని అధికారుల చర్యలు**
- **1996 నుంచి కొనసాగుతున్న న్యాయపోరాటానికి తెర**
- **కోర్టు తీర్పుతో రంగంలోకి దిగిన కంటోన్మెంట్ బోర్డు**
- **జేసీబీలతో నిర్మాణం నేలమట్టం**

సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలో దశాబ్దాలుగా వివాదాస్పదంగా ఉన్న కేజేఆర్ గార్డెన్‌ను కంటోన్మెంట్ బోర్డు అధికారులు శుక్రవారం పూర్తిగా నేలమట్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా నిర్మించి, ఫంక్షన్ హాల్‌గా నిర్వహిస్తున్న ఈ కట్టడంపై అధికారులు కఠిన చర్యలు తీసుకున్నారు. న్యాయస్థాన ఆదేశాల మేరకు ఈ కూల్చివేత ప్రక్రియను చేపట్టారు. శుక్రవారం ఉదయం కంటోన్మెంట్ అధికారులు భారీ పోలీసు బందోబస్తు నడుమ యంత్రాలతో కేజేఆర్ గార్డెన్ వద్దకు చేరుకున్నారు. అనంతరం ఫంక్షన్ హాల్ నిర్మాణాన్ని కూల్చివేయడం ప్రారంభించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు ముందస్తు రక్షణ చర్యలు చేపట్టారు. కొద్ది గంటల వ్యవధిలోనే ఆ నిర్మాణాన్ని అధికారులు పూర్తిగా నేలమట్టం చేశారు. సదరు స్థలంలో అక్రమ నిర్మాణంపై 1996 నుంచి న్యాయస్థానంలో వివాదం కొనసాగుతోంది. కేజేఆర్ గార్డెన్ యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా ఫంక్షన్ హాల్‌ను నిర్మించి, వాణిజ్య కార్యకలాపాలు



నిర్వహిస్తోందని కంటోన్మెంట్ బోర్డు గతంలోనే స్పష్టం చేసింది. దీనిపై సుదీర్ఘకాలం పాటు సాగిన న్యాయపోరాటంలో ఇటీవలే న్యాయస్థానం కంటోన్మెంట్ బోర్డుకు అనుకూలంగా తీర్పు వెలువరించింది. కోర్టు ఆదేశాల మేరకు కంటోన్మెంట్ అధికారులు ఈ కూల్చివేత ప్రక్రియను పూర్తి చేశారు. దీంతో దాదాపు రెండు దశాబ్దాలకు పైగా కొనసాగుతున్న వివాదానికి తెరపడినట్లయింది.

# 'సిబ్బంది'ని పిలిపించుకున్న రూబియో.. జైశంకర్‌పై రాహుల్ అనుచిత వ్యాఖ్యలు



అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో భారత పర్యటనపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందిస్తూ కేంద్రంపై విమర్శలు గుప్పించారు. ఈ పర్యటనపై భారత విదేశాంగ శాఖ అధికారులు గందరగోళానికి గురవుతున్నారని అన్నారు. అంతేకాదు.. విదేశాంగ మంత్రి జైశంకర్‌ను.. పరోక్షంగా 'రూబియో సిబ్బంది' అంటూ అనుచిత వ్యాఖ్యలు చేశారు. రూబియో పర్యటనపై భారత్‌లోని అమెరికా రాయబారి సెర్గియో గోర్ గురువారం మాట్లాడారు. తమ విదేశాంగ మంత్రి ముంబయిలో భారత ప్రభుత్వ అధికారులతో సమావేశం కానున్నట్లు తెలిపారు. ఈ సమావేశాల్లో జైశంకర్ పాల్గొంటారని అనుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలపై రాహుల్ గాంధీ 'ఎక్స్' వేదికగా స్పందించారు. ''రూబియో తన సిబ్బందిని ముంబయికి రావాలని ఆదేశించారు. మోదీజీ.. విదేశాంగ మంత్రిత్వ శాఖలోని మీ అధికారులు ఏం జరుగుతుందో అర్థంకాక గందరగోళానికి గురవుతున్నారు. వారికి మీరు వివరించాలేమో..! లేదంటే నన్ను చెప్పమన్నా సరే..!'' అని కాంగ్రెస్ నేత రాసుకొచ్చారు. మార్కో రూబియో వచ్చేవారం భారత్‌కు రానున్నారు. పర్యటనలో భాగంగా గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో గల రిలయన్స్ యూనిట్‌ను సందర్శిస్తారు. ఆ తర్వాత ముంబయిలోని పలువురు వ్యాపారవేత్తలు, అధికారులతో సమావేశం కానున్నారు. ఈ క్రమంలోనే జైశంకర్‌ రూబియో భేటీ కూడా ఉండొచ్చని సమాచారం. ద్వైపాక్షిక వ్యూహాత్మక భాగస్వామ్యం, ప్రాంతీయాభివృద్ధిలో పరస్పర సహకారం వంటి అంశాలపై వీరు చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## విజయవాడ- విశాఖ మధ్య ప్రత్యేక రైళ్లు



విశాఖపట్నం: దసరా పండగ నేపథ్యంలో ప్రయాణికుల సౌకర్యార్థం విజయవాడ విశాఖపట్నం మధ్య ప్రత్యేక రైళ్లు నడపాలని రైల్వేశాఖ నిర్ణయించింది. ఈ నెల 17న (శనివారం) విశాఖవిజయవాడ మధ్య, 19న (సోమవారం) విజయవాడవిశాఖ మధ్య జనసాధారణ్ ప్రత్యేక రైళ్లు నడవనున్నట్లు వెల్లడించింది. ఈ రైళ్లు దువ్వాడ, అనకాపల్లి, తుని, సామర్లకోట, రాజమహేంద్రవరం, తాడేపల్లిగూడెం, ఏలూరు స్టేషన్లలో ఆగనున్నాయి. మరోవైపు ఈ నెల 17, 18 తేదీల్లో విజయవాడ పలాస.. 18, 19 తేదీల్లో పలాసవిజయవాడ మధ్య జనసాధారణ్ ప్రత్యేక రైళ్లు నడపనున్నారు.

## ఎల్ నినోపై సీఎం రేవంత్ పిలుపు.. స్పందించిన నాగార్జున

- **ఎల్ నినోపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సీఎం రేవంత్ పిలుపున**
- **సహాయం చేయడానికి సినీ పరిశ్రమ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందన్న నాగార్జున**
- **తెలంగాణలో తీవ్ర నీటి, విద్యుత్ సంక్షోభం తప్పదని హెచ్చరించిన ప్రభుత్వం**



తెలంగాణలో ఎల్ నినో ప్రభావంతో తలెత్తనున్న సంక్షోభంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చిత్ర పరిశ్రమ సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన పిలుపునకు ప్రముఖ నటుడు అక్కినేని నాగార్జున సంపూర్ణ మద్దతు ప్రకటించారు. విపత్కర పరిస్థితుల్లో సహాయం అందించేందుకు సినీ రంగం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఇటీవల 'ఇట్లు అర్జున' చిత్రానికి సంబంధించిన ఓ కార్యక్రమంలో నాగార్జున మాట్లాడుతూ, ఎల్ నినో ప్రభావం కేవలం తెలంగాణకే పరిమితం కాదని, ఇది ప్రపంచవ్యాప్త సమస్య అని పేర్కొన్నారు. ఇటువంటి క్లిష్ట సమయాల్లో ప్రజల్లో చైతన్యం తీసుకురావడం అత్యవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. సామాజిక సమస్యలు ఎదురైనప్పుడు సినీ పరిశ్రమ ఎల్లప్పుడూ ముందుండి తన వంతు సహకారాన్ని అందిస్తుందని ఆయన గుర్తుచేశారు. ఎల్ నినో ప్రభావం ఎంతకాలం కొనసాగుతుందో అంచనా వేయలేమని, అందుకే ప్రజలందరూ నీటిని పొదుపుగా వినియోగించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో తీవ్ర నీటి, విద్యుత్ సంక్షోభం తలెత్తే అవకాశం ఉందని ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించిన సంగతి విదితమే. వర్షపాతం గణనీయంగా తగ్గడం వల్ల కృష్ణా, గోదావరి బేసిన్లలోని జలాశయాల్లో నీటి నిల్వలు ప్రమాదకర స్థాయికి పడిపోయాయని ప్రభుత్వం వెల్లడించింది. సాధారణంగా అవసరమయ్యే 460 టీఎంసీలకు గాను, ప్రస్తుతం కేవలం 200 209 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉందని వివరించింది. ఈ నేపథ్యంలో, రాబోయే యాసంగి సీజన్‌లో నీటి వినియోగం ఎక్కువగా ఉండే వరి సాగును తగ్గించుకోవాలని లేదా వాయిదా వేసుకోవాలని రైతులకు ముఖ్యమంత్రి సూచించారు. తాగునీటి సరఫరాకు ప్రథమ ప్రాధాన్యతనిస్తూ, విద్యుత్‌ను కూడా అత్యంత పొదుపుగా వినియోగించాలని ఆయన ప్రజలను కోరారు.

## 18 నెలల చిన్నారిని ఆరో అంతస్తు నుంచి పడేసిన 10 ఏళ్ల బాలిక



మహారాష్ట్రలో దిగ్భ్రాంతికర ఘటన చోటుచేసుకుంది. 10 ఏళ్ల బాలిక 18 నెలల చిన్నారిని ఆరో అంతస్తు నుంచి కిందికి తోసేసింది. దాంతో ఆ పసిబిడ్డ ప్రాణాలు కోల్పోయింది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం. ముంబయి లోని గోరెగావ్ ప్రాంతంలోని నివాస సముదాయంలో బాలిక, చిన్నారి కుటుంబాలు నివసిస్తున్నాయి. బుధవారం రాత్రి సమయంలో బాలిక.. చిన్నారిని తీసుకొని ఆరో అంతస్తుకు వెళ్లింది. అక్కడి నుంచి చిన్నారిని కిందికి తోసేసింది. ఆ తర్వాత బాలిక మెట్లపై నుంచి కిందికి పరుగెత్తిన దృశ్యాలు సీసీటీవీలో రికార్డయ్యాయి. చిన్నారి మృతిపై సమాచారం అందుకున్న పోలీసులు బాలిక, ఆమె తల్లిని అదుపులోకి తీసుకున్నారు. పిల్లి విషయంలో ఇరు కుటుంబాల మధ్య గొడవ జరిగినట్లు తెలుస్తోంది. అలాగే ఆ బాలిక మానసిక సమస్యలతో బాధపడుతున్నట్లు సమాచారం. అయితే ఈ ఘటనకు అసలు కారణమేంటనే దానిపై దర్యాప్తు జరుగుతోందని పోలీసులు వెల్లడించారు. తొలుత ఈ ఘటనను ప్రమాదంగా భావించారు. అయితే.. అపార్ట్‌మెంట్‌లో రక్షణ కోసం పెట్టిన రెయిలింగ్స్ ఎత్తు ఎక్కువగా ఉండటంతో.. అనుమానించిన పోలీసులు సీసీటీవీ దృశ్యాలను పరిశీలించారు. చిన్నారిని కింద పడేసిన తర్వాత.. బాలిక పరుగెత్తడం వాటిల్లో రికార్డయింది. మరోవైపు తమ బిడ్డ కనిపించడం లేదని వెతుకుతున్న బాధిత కుటుంబం ఈ ఘటనతో ఒక్కసారిగా షాక్‌కు గురైంది. వెంటనే చిన్నారిని ఆసుపత్రికి తరలించగా.. తలకు తీవ్రగాయాలు కావడంతో మార్గంమధ్యలోనే ప్రాణాలు కోల్పోయినట్లు వైద్య సిబ్బంది వెల్లడించారు. నిందితురాలు మైనర్ కావడంతో బాలల సంక్షేమ అధికారుల పర్యవేక్షణలో కేసు విచారణ జరుగుతోందని పోలీసులు వెల్లడించారు.

## తిరంగా మార్చ్ వేళ.. పోలీసుల అదుపులో అభిజీత్ దీప్కే



సీజేపీ తిరంగా మార్చ్ (Lehra Do Tiranga)కు పిలుపు ఇచ్చిన వేళ శుక్రవారం దేశ రాజధాని దిల్లీలో ఉద్రిక్తత నెలకొంది. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే (Abhijeet Dipke)ను దిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కరోల్‌బాగ్‌లో ఆయన బస చేసిన చోటు నుంచి కన్నాట్ ప్లేస్‌లోని సెంట్రల్ పార్కు వద్దకు బయల్దేరడానికి సిద్ధమవుతుండగా పోలీసులు అడ్డుకొని, అదుపులోకి తీసుకున్నారు. దీంతో పోలీసుల వాహనాన్ని ముందుకు వెళ్లనివ్వకుండా నిరసనకారులు చుట్టుముట్టారు. పోలీసులు తనను అరెస్ట్ చేయడంపై దీప్కే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ చట్టాన్ని ఉల్లంఘించినందుకు తనను నిర్బంధించారో చెప్పాలని ప్రశ్నించారు. వారం రోజుల్లో దీప్కేను అదుపులోకి తీసుకోవడం ఇది రెండోసారి. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ.. సర్ ప్రక్రియకు వ్యతిరేకంగా దిల్లీలోని సెంట్రల్ పార్క్ వద్ద శుక్రవారం సాయంత్రం ఐదుగంటలకు జాతీయ జెండాను ఎగరవేయాలని సీజేపీ తన మద్దతుదారులకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. సీజేపీ సభ్యులు సౌరవ్‌దాస్, అశుతోశ్ రంకా అరెస్టు కూడా ఈ మార్చ్‌కు మరో కారణం. ఈ నేపథ్యంలోనే పోలీసులు తొలుత దీప్కే నివాసం ఉన్న చోటకు వెళ్లి నోటీసులు ఇచ్చారు. సోషల్ మీడియాలో ప్రజలను రెచ్చగొడుతున్నారని, అలాంటి చర్యలు చట్టవిరుద్ధమని అందులో పేర్కొన్నారు. అయితే.. ఈ ఆరోపణలు హాస్యాస్పదమని, హింసను ప్రేరేపించేవిధంగా ఉన్న ఒక్క వీడియోనైనా చూపించాలని దీప్కే పోలీసులతో అన్నారు.

## మళ్లీ రక్షణ వలయంలోకి దిల్లీ.. పార్క్ మూసివేతపై అత్యవసర విచారణకు సుప్రీం నో



దేశ రాజధాని దిల్లీలోని కన్నాట్‌ప్లేస్‌లో ఉన్న సెంట్రల్ పార్క్‌లో కాక్రోచ్ జనతా పార్టీ శుక్రవారం 'లెహ్రా దో తిరంగా' పేరుతో ర్యాలీని నిర్వహించనుంది. ఈ నేపథ్యంలో రాజధాని నగరంలో భద్రతను కట్టుదిట్టం చేశారు. 6 వేలమంది దిల్లీ పోలీసులు, 220 కంపెనీల కేంద్ర సాయుధ బలగాలను మోహరించారు. సీసీటీవీ కెమెరాల సంఖ్యను పెంచారు. కన్నాట్ ప్లేస్ సహా రాజీవ్ చౌక్, సెంట్రల్ పార్క్, జంతర్ మంతర్, పాలికా బజార్‌లతోపాటు సమీపంలోని మెట్రో స్టేషన్లు, సున్నిత ప్రాంతాల్లో భద్రతను పెంచారు. శుక్ర, శనివారాల్లో సెంట్రల్ పార్క్‌లోకి ప్రజలకు అనుమతి లేదని న్యూదిల్లీ మున్సిపల్ కౌన్సిల్ ప్రకటించింది. ఈ తిరంగా ర్యాలీని .. పరిమిత సంఖ్యలో, వేరే ప్రదేశంలో నిర్వహించుకోవడానికి అనుమతిస్తామని దిల్లీ పోలీసులు చెప్పారు.

**జైలుకు వెళ్లడానికి సిద్ధమే: అభిజీత్ దీప్కే**

''మేం సెంట్రల్ పార్క్ వద్ద శాంతియుతంగా తిరంగాను ఎగురవేస్తాం. దానిని కూడా నేరంగా పరిగణిస్తే.. అప్పుడు మీరే ద్రోహులు. జాతీయ పతాకాన్ని ఎగురవేసినందుకు జైలుకు వెళ్లాల్సి వస్తే.. అందుకు మేం సిద్ధమే'' అని మీడియాతో మాట్లాడుతూ దీప్కే అన్నారు.

**అత్యవసర విచారణకు నో..**

సెంట్రల్ పార్క్ మూసివేస్తూ ఎన్‌డీఎంసీ తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. దానిపై అత్యవసర విచారణకు న్యాయస్థానం నిరాకరించింది. ''ప్రతి ఒక్కరూ వివేకంతో ప్రవర్తిస్తారని ఆశిస్తున్నాం. ఈ నిరసనల కారణంగా పండగ సీజన్‌లో పలు కుటుంబాలు ఎదుర్కొనే కష్టాలు, ఇబ్బందులు మాకు తెలుసు'' అని పేర్కొంది. నిరసనలు తెలిపే హక్కు, జీవనోపాధి, శాంతిభద్రతలు ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయని వ్యాఖ్యానించింది. నగరంలో నిషేధాజ్ఞలు విధించడం వల్లే వ్యాపారాలు దెబ్బతింటాయని, శాంతియుత నిరసనల వల్ల కాదని మరోవైపు దీప్కే అన్నారు.




## జనసేన 'గ్రాడ్యుయేట్ ఎక్స్ ప్రెస్' ప్రారంభించిన పవన్ కల్యాణ్

- **పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం జనసేన ప్రచార రథం ప్రారంభం**
- **'గ్రాడ్యుయేట్ ఎక్స్‌ప్రెస్'ను జెండా ఊపి ప్రారంభించిన పవన్ కల్యాణ్**
- **అభ్యర్థి గడల శ్రీనివాసరావు గెలుపునకు పలు సూచనలు**
- **యువత సమస్యలు తెలుసుకునే వేదికగా ఉండాలని పిలుపు**

ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి జనసేన సిద్ధమైంది. ఈ ఎన్నికల కోసం ప్రత్యేకంగా రూపొందించిన 'జనసేన గ్రాడ్యుయేట్ ఎక్స్‌ప్రెస్' ప్రచార రథాన్ని పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ శుక్రవారం హైదరాబాదులో ప్రారంభించారు. ఈ సందర్భంగా వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ జనసేన అభ్యర్థిగా బరిలో ఉన్న డాక్టర్ గడల శ్రీనివాసరావుకు పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రచారానికి సంబంధించి ఆయనకు పలు సూచనలు చేశారు. ఈ 'గ్రాడ్యుయేట్ ఎక్స్‌ప్రెస్' కేవలం ఎన్నికల ప్రచార వాహనంగానే పరిమితం కాకూడదని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. యువత ఎదుర్కొంటున్న సమస్యలను నిరంతరం తెలుసుకుంటూ, వాటి పరిష్కారానికి కృషి చేసే ఒక ప్రజాసేవా వేదికగా ఇది కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు. హైదరాబాదులోని జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది.

## బంగ్లాదేశ్ లాంటి 'పాలన మార్పు' కావాలట.. విపక్షాలకు రాజ్‌నాథ్ కౌంటర్



దేశంలో గందరగోళం సృష్టించడానికి ప్రజాస్వామ్యం ఎలాంటి లైసెన్స్ ఇవ్వదని కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. యువ శక్తిని వాడుకుని విపక్షాలు అరాచకాన్ని వ్యాప్తి చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. బంగ్లాదేశ్ లాంటి పాలన మార్పు కావాలని కాంగ్రెస్ (Congress), దాని మిత్రపక్షాలు కోరుకుంటున్నాయని ధ్వజమెత్తారు. ఉత్తరప్రదేశ్‌లోని లఖ్‌నవూలో జరిగిన మీడియా సమావేశంలో విపక్షాల ఆందోళనలపై రాజ్‌నాథ్ (Rajnath Singh) స్పందించారు. ''రాజకీయాల కోసం కాంగ్రెస్, దాని మిత్ర పార్టీలు ఈ దేశ యువతను పావులుగా వాడుకుంటున్నాయి. దేశాభివృద్ధిలో నిర్మాణాత్మక పాత్ర పోషించేలా యువతకు దిశానిర్దేశం చేయడానికి బదులు.. రాజకీయ ఘర్షణలను రెచ్చగొట్టేందుకు వారిని ఉపయోగించుకుంటున్నాయి. పాలన మార్పు కోసం బంగ్లాదేశ్ నుంచి స్ఫూర్తి పొందామని వారు బహిరంగ సమావేశాల్లోనే చెబుతున్నారు. ప్రభుత్వాన్ని పడగొడుతామని అంటున్నారు. వారి పోరాటం ఎన్నికల వ్యవస్థ, సర్ ప్రక్రియకు సంబంధించిన సమస్యలపై కాదు..! ప్రజాస్వామ్య సంస్థలను కూల్చివేసి, దేశాన్ని తగలబెట్టడమే వారి ఏకైక అజెండా అని స్పష్టమవుతోంది'' అని రాజ్‌నాథ్ విమర్శించారు. ఈ సందర్భంగా విపక్షాల ర్యాలీని తప్పుబడుతూ సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలను రక్షణమంత్రి సమర్థించారు. ''శాంతిభద్రతలను కాపాడటానికి చట్టాన్ని గౌరవించడం అత్యవసరం. రాజకీయ స్వప్రయోజనాల కోసం ప్రజాస్వామ్య సంస్థలను బలిచేయకూడదు. ఇలాంటి అసత్య ఆరోపణలతో, అవకాశవాద రాజకీయాలతో దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించలేం. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఇకనైనా ప్రజా తీర్పును గౌరవించి.. రాజకీయాల్లో తన పాత్రపై ఆత్మపరిశీలన చేసుకోవాలి. భారత భవిత ప్రతి ఒక్కరి బాధ్యత'' అని రాజ్‌నాథ్ విపక్ష నేతకు చురకలంటించారు.

**ప్రధాని పదవి కావాలంటే..: కంగన**

విపక్షాల నిరసనలు, పాలనమార్పు వ్యాఖ్యలపై నటి, భాజపా ఎంపీ కంగనా రనౌత్ స్పందిస్తూ.. ప్రధాని మోదీ పాత వీడియో ఒకటి షేర్ చేశారు. అందులో మోదీ మాట్లాడుతూ.. ఎన్నికల్లో గందరగోళం సృష్టిస్తే ప్రధాని కాలేరని, ప్రజల హృదయాలను గెలుచుకోవాలని అన్నారు. ఆ వీడియోతో కంగన ప్రతిపక్ష నేతలకు కౌంటర్ ఇచ్చారు.

## ఉక్రెయిన్‌కు ఉప్పందించి.. 300 మంది సైనికుల మరణానికి కారణమై!



రష్యాఉక్రెయిన్ మధ్య సుదీర్ఘ కాలంగా యుద్ధం కొనసాగుతుండగా.. ఇటీవల ఓ సంచలన విషయం వెలుగు చూసింది. రష్యాకు చెందిన ఓ సైనికాధికారి సొంత సైన్యానికే ద్రోహం చేసినట్లు తెలిసింది. తన సైన్యం ప్రణాళికలను, నిఘా సమాచారాన్ని ప్రత్యర్థికి అందించి.. ఏకంగా 300 మంది రష్యా సైనికుల మరణానికి కారణమయ్యాడు. చివరకు ఉక్రెయిన్‌కు పారిపోయి ప్రత్యర్థితో కలిసి సొంత సైన్యంపైనే పోరాటం చేస్తున్నాడు. ఇందుకు సంబంధించి వాల్‌స్ట్రీట్ జర్నల్ ప్రత్యేక కథనంలో ఈ విషయాలు వెల్లడించింది. రష్యా సైన్యంలో కీలక హోదాలో ఉన్న ఓ సైనికాధికారి.. డాన్‌బాస్ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్నాడు. ఆ దేశ యుద్ధ ప్రణాళికలు, సైన్యం కదలికలు, డ్రోన్, కెమెరాల నుంచి వచ్చే సున్నితమైన సమాచారం తెలుసుకునే వెసులుబాటు అతడికి ఉంది. అయితే, ఉక్రెయిన్‌పై దండయాత్ర, తమ సైన్యంలో అవినీతి, సొంత ప్రభుత్వం చర్యలపై తీవ్ర అసంతృప్తితో ఉన్న అతడు.. ఉక్రెయిన్‌కు ఇన్ఫార్మర్‌గా మారిపోయాడు. ప్రత్యర్థి సైనిక నిఘా విభాగంలో ఓ వ్యక్తితో సంప్రదింపులు జరుపుతూ రహస్య సమాచారం అందించడం మొదలుపెట్టాడు.

# వచ్చేసింది..గాల్లో ఎగిరే కారు

• ఎలాన్ మస్క్ సంచలనం..

**టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్ సరికొత్త రోడ్‌స్టర్ ఎలక్ట్రిక్ స్పోర్ట్స్ కారును ఆవిష్కరించారు. గురువారం నిర్వహించిన ప్రత్యక్ష ప్రదర్శనలో ఈ కారు చేసిన విన్యాసం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. వంపుగా ఉన్న ర్యాంప్‌పై తలకిందులుగా ప్రయాణించిన కారు, కొద్దిసేపు గాల్లోకి ఎగిరి, తిరిగి సురక్షితంగా నేలపై దిగింది. టెస్లా తొలిసారిగా ఈ కొత్త రోడ్‌స్టర్‌ను ప్రకటించిన దాదాపు తొమ్మిదేళ్ల తర్వాత ఈ ప్రదర్శన జరగడం విశేషం. అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రం మెక్‌గ్రెగర్‌లో ఉన్న స్పేస్‌ఎక్స్ కేంద్రంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రదర్శనకు సంబంధించిన వీడియోను మస్క్ తన ఎక్స్ ఖాతాలో పంచుకుంటూ.. భవిష్యత్తులో ఎగిరే కార్లు కూడా ఉంటాయని తెలిపిన వ్యాఖ్యానించారు.**



**ఎగిరే రోడ్‌స్టర్ ఎలా పనిచేస్తుంది?**

ఈ రోడ్‌స్టర్‌లో అధిక పీడనంతో కూడిన గాలి ట్యాంక్, ప్రత్యేకంగా రూపొందించిన థ్రస్టర్లు ఉన్నాయని ఎలాన్ మస్క్ వివరించారు. ఈ వ్యవస్థలోని థ్రస్టర్లు కారు ఎత్తును నియంత్రిస్తూ నేల నుంచి పైకి లేపేందుకు సహాయపడతాయి. వెనుక భాగంలో ఏర్పాటు చేసిన అదనపు థ్రస్టర్లు కారు గాల్లో పల్టీలు కొట్టడం వంటి విన్యాసాలకు ఉపయోగపడే అవకాశం ఉంటుంది. కారు విన్యాసాన్ని విజయవంతంగా పూర్తి చేసి సురక్షితంగా నేలపై దిగిన తర్వాత మస్క్ స్పందిస్తూ.. ఇది పనిచేసిందని అన్నారు. టెస్లా వాహన ఇంజినీరింగ్ విభాగం ఉపాధ్యక్షుడు లార్స్ మోరావీ కూడా ఈ ప్రదర్శనపై స్పందిస్తూ.. ఎగిరే కార్లు నిజంగానే ఉన్నాయని అన్నారు.

ఫౌండర్స్ సిరీస్ కోసం ముందస్తుగా 2.50 లక్షల డాలర్లు చెల్లించాల్సి ఉంటుందని ప్రకటించారు. అలాగే స్పేస్‌ఎక్స్ ప్యాకేజీని కూడా ప్రతిపాదించారు. ఇందులో అమర్చే థ్రస్టర్లు కారు గాల్లోకి ఎగరడానికి సహాయపడతాయని మస్క్ గతంలో వెల్లడించారు. అయితే ఈ కారు విడుదల అనేకసార్లు వాయిదా పడడంతో వినియోగదారులు సంవత్సరాల తరబడి ఎదురుచూడాల్సి వచ్చింది. రిజర్వేషన్లు చేసుకున్న వారిని మస్క్ చాలాకాలంగా ఎదురుచూస్తున్న వినియోగదారులుగా పేర్కొంటూ క్షమాపణలు చెప్పారు.

**క్షణాల్లోనే 0 నుంచి 100 కిలోమీటర్ల వేగం..**

టెస్లా మరో ప్రత్యేక ప్రదర్శనలో రోడ్‌స్టర్ పనితీరును చూపించింది. సంస్థ తెలిపిన వివరాల ప్రకారం, ఈ కారు గంటకు 60 మైళ్ల వేగాన్ని, అంటే సుమారు 96.6 కిలోమీటర్ల వేగాన్ని, నిలిచిన స్థితి నుంచి కేవలం 0.81 సెకన్లలో అందుకున్నట్లు పేర్కొంది. ఈ కారు ఒక్కసారి ఛార్జింగ్ చేస్తే సుమారు 300 మైళ్లు, అంటే దాదాపు 483 కిలోమీటర్లు ప్రయాణిస్తుందని, గరిష్ఠ వేగం గంటకు 230 మైళ్లకు పైగా ఉంటుందని కంపెనీ వెల్లడించింది.

**మూడు వెర్షన్లలో రోడ్‌స్టర్.. భారీ డిపాజిట్లు..**

టెస్లా తన రోడ్‌స్టర్‌ను పెర్ఫార్మెన్స్, థ్రస్ట్, రాకెట్ అనే మూడు వెర్షన్లలో అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు పేర్కొంది. పెర్ఫార్మెన్స్ వెర్షన్‌ను రిజర్వ్ చేసుకోవడానికి 5వేల డాలర్లు డిపాజిట్ చేయాలి. అనంతరం 10 రోజుల్లో మరో 45వేల డాలర్లు చెల్లించాల్సి ఉంటుంది. థ్రస్ట్ వెర్షన్ కోసం 2.50 లక్షల డాలర్ల డిపాజిట్ అవసరం. రాకెట్ వెర్షన్ మాత్రం ఆహ్వానం పొందిన వారికి మాత్రమే అందుబాటులో ఉంటుందని కంపెనీ తెలిపింది. టెస్లా తన తొలి రోడ్‌స్టర్‌ను 2008లో మార్కెట్లోకి తీసుకొచ్చింది. ఈ మోడల్ ఉత్పత్తి 2012లో నిలిచిపోయింది. అనంతరం 2017లో ఎలాన్ మస్క్ కొత్త తరం రోడ్‌స్టర్‌ను ప్రకటించారు. అధిక వేగం, ఎక్కువ ప్రయాణ పరిధి, వేగవంతమైన యాక్సిలరేషన్ వంటి ప్రత్యేకతలను అప్పట్లో హామీ ఇచ్చారు. ఈ కారును ముందుగానే రిజర్వ్ చేసుకోవడానికి వినియోగదారులు 50వేల డాలర్లు డిపాజిట్ చేసే అవకాశం కల్పించారు.

# స్టార్‌లింక్‌కు భయపడం

• స్వాగతిస్తామన్న రిలయన్స్

**శాటిలైట్ కమ్యూనికేషన్స్ రంగంలో పోటీకి తాము ఎప్పుడూ భయపడలేదని రిలయన్స్ ఇండస్ట్రీస్ స్పష్టం చేసింది. ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్ సహా ఏ సంస్థ అయినా భారత చట్టాలు, విధానాలకు అనుగుణంగా పనిచేస్తే స్వాగతిస్తామని వెల్లడించింది.**




శాటిలైట్ కమ్యూనికేషన్స్ రంగంలో పోటీపై స్పందిస్తూ, స్టార్‌లింక్‌తో సహా అన్ని సంస్థలను స్వాగతిస్తున్నామని రిలయన్స్ పేర్కొంది. జియో సహా ప్రతి సంస్థ భారత ప్రజలకు సేవలందించడంతోపాటు దేశ చట్టాలు, విధానాలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేసింది. వినియోగదారులకు అత్యుత్తమ సేవలు అందించేది ఎవరో తేల్చేందుకు పోటీనే నిజమైన పరీక్ష అని అభిప్రాయపడింది.

**భారత్‌లో అత్యంత చవక ధరకే మొబైల్ డేటా..**

మరోవైపు, భారత్‌లో స్టార్‌లింక్ సేవల ధరలను మస్క్ ఇంకా ప్రకటించలేదు. ప్రస్తుతం దేశంలో మొబైల్ డేటా ధర జీబీకి సుమారు రూ.7.74గా ఉండడం గమనార్హం. ప్రపంచంలోనే అత్యంత తక్కువ ధరల్లో డేటా సేవలు అందుబాటులో ఉన్న మార్కెట్లలో భారత్ ఒకటిగా ఉంది. ఇక స్టార్‌లింక్ సంస్థను మాత్రమే లక్ష్యంగా చేసుకుని ప్రభుత్వం అనుమతుల ప్రక్రియను ఆలస్యం చేస్తోందన్న వాదనను కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ తోసిపుచ్చింది.

**530 మిలియన్లకు పైగా వినియోగదారులు..**

కేవలం పదేళ్లలో 530 మిలియన్లకు పైగా వినియోగదారుల నమ్మకాన్ని సంపాదించిందని జియో పేర్కొంది. రిలయన్స్ టెలికాం విభాగానికి యజమానిగా ఉన్న జియో ప్లాట్‌ఫామ్స్ త్వరలో దేశంలోనే అతిపెద్ద ఐపీఓ ద్వారా 106 బిలియన్ డాలర్లుగా లక్ష్యంగా పెట్టుకున్నది.



## అకౌంట్ లేకున్నా వాట్సాప్ కాల్

**వాట్సాప్ వినియోగదారులకు కీలకమైన కొత్త ఫీచర్ అందుబాటులోకి వస్తోంది. వాట్సాప్ అకౌంట్ లేని వ్యక్తులు సైతం ఆహ్వాన లింక్ ద్వారా వ్యక్తిగత, గ్రూప్ కాల్స్‌లో పాల్గొనేందుకు వీలుగా గెస్ట్ కాలింగ్ ఫీచర్‌ను సంస్థ పరిచయం చేసింది.**

వాట్సాప్ వినియోగదారులు యాప్‌లోని కాల్స్ ట్యాబ్‌లో ప్లస్ (+) గుర్తుపై ట్యాప్ చేసి కాల్ లింక్‌ను సృష్టించవచ్చు. అనంతరం ఆ లింక్‌ను కాల్‌లో పాల్గొనాలని కోరుకునే వ్యక్తులతో పంచుకోవచ్చు. అయితే కాల్ లింక్‌లను సృష్టించే అవకాశం వాట్సాప్ అకౌంట్ ఉన్నవారికే మాత్రమే ఉంటుంది. గెస్ట్‌లు తమ కంప్యూటర్ బ్రౌజర్‌లో ఆహ్వాన లింక్‌ను తెరిచి, పేరును నమోదు చేసి కాల్‌లో చేరేందుకు వేచి ఉండవచ్చు. హోస్ట్ అనుమతి ఇచ్చే వరకు వారు వెయిటింగ్ రూమ్‌లోనే ఉంటారు. హోస్ట్ ఆమోదించిన తర్వాతే కాల్‌లో పాల్గొనడానికి అవకాశం లభిస్తుంది.

## టెక్నో స్పార్క్ 50ఎస్ 5జీతో నెట్‌వర్క్ లేకున్నా కమ్యూనికేషన్..

**భారత్‌లో టెక్నో స్పార్క్ 50ఎస్ 5జి స్మార్ట్‌ఫోన్‌ను టెక్నో అధికారికంగా విడుదల చేసింది. విడిభాగాలు, మెమరీ ధరలు పెరుగుతున్న నేపథ్యంలో రూ.20 వేల లోపు స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లోకి ఈ ఫోన్‌ను తీసుకొచ్చింది. రోజువారీ అవసరాలకు అనుగుణంగా రూపొందించిన ఈ స్మార్ట్‌ఫోన్‌లో మెరుగైన నెట్‌వర్క్ కనెక్టివిటీ, మన్నికైన నిర్మాణం, ఎక్కువసేపు పనిచేసే బ్యాటరీపై కంపెనీ ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. తక్కువ సిగ్నల్ అందే ప్రాంతాల్లోనూ స్థిరమైన కనెక్టివిటీని అందించడం టెక్నో స్పార్క్ 50ఎస్ 5జి ప్రధాన లక్ష్యాల్లో ఒకటి. ఇందుకోసం ఇందులో 4*4 ఎంఐఎంఓ యాంటెన్నా సాంకేతికతను అందించారు. దీనివల్ల డౌన్‌లోడ్ వేగం 82 శాతం వరకు పెరుగుతుందని కంపెనీ పేర్కొంది. రద్దీగా ఉండే ప్రాంతాల్లో యూపీఐ లావాదేవీల వేగాన్ని పెంచేందుకు యూపీఎస్ 3.0 సాంకేతికతను కూడా అందించింది. కంపెనీ పరీక్షల ప్రకారం, బేస్‌మెంట్లు, రవాణా కేంద్రాలు, రద్దీగా ఉండే వాణిజ్య ప్రాంతాల్లో యూపీఐ లావాదేవీలు రెండు రెట్లు వేగంగా పూర్తయ్యే అవకాశం ఉంటుంది.**




**నెట్‌వర్క్ లేకున్నా కమ్యూనికేషన్..**

మొబైల్ నెట్‌వర్క్ పూర్తిగా అందుబాటులో లేని పరిస్థితుల్లోనూ కమ్యూనికేషన్ కొనసాగించేందుకు ఇందులో ప్రత్యేకంగా ఫ్రీలింక్ ఫీచర్‌ను అందించారు. ఎలాంటి అడ్డంకులు లేని ప్రాంతాల్లో, ఒకదానికొకటి నేరుగా సిగ్నల్ అందే పరిస్థితుల్లో ఈ ఫీచర్ ద్వారా 1.5 కిలోమీటర్ల దూరం వరకు వాయిస్ కాల్స్ చేసుకోవచ్చు. టెక్స్ట్ సందేశాలు పంపుకోవడంతోపాటు చిత్రాలను కూడా షేర్ చేసుకోవచ్చు. ఇందుకు సెల్యులార్ నెట్‌వర్క్ లేదా వై-ఫై అవసరం లేదు. గోదాములు, వ్యవసాయ క్షేత్రాలు, పారిశ్రామిక ప్రాంతాల్లో పనిచేసే వారికి ఈ ఫీచర్ ఉపయోగపడుతుందని కంపెనీ చెబుతోంది.

టెక్నో స్పార్క్ 50ఎస్ 5జి స్మార్ట్‌ఫోన్ బర్గండీ రెడ్, బ్రీజ్ బ్లూ రంగుల్లో లభిస్తోంది. రోజువారీ వినియోగంలో ఫోన్‌కు ఎదురయ్యే దెబ్బలు, దుమ్ము, నీటి చినుకుల నుంచి రక్షణ కల్పించేందుకు ఐపీ64 ప్రొ రేటింగ్‌తో రూపొందించారు.

# కల్కి 2 షూటింగ్ షురూ



టాలీవుడ్‌లో మోస్ట్ బిజీయెస్ట్ హీరోగా కొనసాగుతోన్నారు ప్రభాస్. ఇన్నాళ్లు నాలుగైదేళ్లకు ఓ ఓ సినిమా చేస్తూ వచ్చిన ప్రభాస్ ప్రస్తుతం ఒకేసారి మూడు సినిమాలు అంగీకరించారు. ఫౌజీ, స్పిరిట్ షూటింగ్‌లతో బిజీగా రెబెల్ స్టార్ తాజాగా కల్కి 2 సెట్స్‌లో అడుగుపెట్టారు.

**నాగ్ అశ్విన్ డైరెక్టర్...**

కల్కి 2898 ఏడీకి సీక్వెల్‌గా కల్కి 2 తెరకెక్కుతోంది. నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో అమితాబ్‌బచ్చన్, కమల్‌హాసన్ కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు. కల్కి 2 షూటింగ్ గురువారం నుంచి మొదలైంది. శంషాబాద్‌లో వేసిన ఓ భారీ సెట్‌లో ప్రభాస్‌పై డైరెక్టర్ నాగ్ అశ్విన్ కీలక సన్నివేశాలను చిత్రీకరించబోతున్నారు. అక్టోబర్ 19వ వరకు హైదరాబాద్‌లో షూట్ చేసి... దసరా తర్వాత ముంబైలో మరో షెడ్యూల్ మొదలుపెట్టబోతున్నట్లు సమాచారం.



# పల్లెటూరి అమ్మాయిగా ఫరియా



హిట్టు కోసం జాతిరత్నాలు బ్యూటీ ఫరియా అబ్దుల్లా తన రూటు మార్చింది. కెరీర్‌లో ఫస్ట్ టైమ్ పల్లెటూరి అమ్మాయిగా ఊర మాస్ పాత్రలో కనిపించబోతుంది. ఈ సినిమా షూటింగ్ కూడా పూర్తయ్యింది. తిరువీర్ హీరోగా తెలుగులో భగవంతుడు పేరుతో పీరియాడికల్ పొలిటికల్ యాక్షన్ మూవీ తెరకెక్కుతోంది. ఈ సినిమాతో జీజీ విహారి డైరెక్టర్‌గా టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇవ్వబోతున్నాడు.

**ఊర మాస్ రోల్...**

ఇందులో తిరువీర్‌కు సరసన ఫరియా అబ్దుల్లా హీరోయిన్‌గా కనిపించబోతుంది. వీరిద్దరి కాంబినేషన్‌లో తెలుగులో రాబోతున్న ఫస్ట్ మూవీ ఇది. ఇప్పటివరకు తెలుగులో చేసిన అన్ని సినిమాల్లో మోడ్రన్ అమ్మాయిగా కనిపించిన ఈ హైదరాబాదీ బ్యూటీ భగవంతుడు సినిమాలో పక్కా పల్లెటూరి అమ్మాయిగా ఊరమాస్ పాత్రలో కనిపించబోతుంది. కంప్లీట్ డీ గ్లామర్ లుక్‌తో ఆమె క్యారెక్టర్ ఛాలెంజింగ్‌గా సాగుతోందని మేకర్స్ చెబుతోన్నారు.

**ఆత్మ గౌరవం వర్సెస్ ఆధిపత్యం...**

ఆత్మగౌరవానికి, ఆధిపత్యధోరణికి మధ్య జరిగిన యుద్ధంలో ఓ యువ జంటకు ఎలాంటి అడ్డంకులు, అవరోధాలు ఎదురయ్యాయనే కాన్సెప్ట్‌తో దర్శకుడు విహారి ఈ సినిమాను తెరకెక్కిస్తోన్నారు. ఈ సినిమా షూటింగ్ పూర్తయ్యింది. త్వరలో రిలీజ్ డేట్‌ను రివీల్ చేయబోతున్నారు.

## సినిమా

# జయలలితగా త్రిష

చెన్నై క్వీన్ త్రిష రాజకీయాల్లోకి అడుగుపెట్టబోతున్నట్లు చాలా కాలంగా వార్తలు వినిపిస్తున్నాయి. ఇటీవలే త్రిష పొలిటికల్ ఎంట్రీని ఉద్దేశిస్తూ తమిళనాట వెలిసిన పోస్టర్లు చర్చనీయాంశంగా మారాయి. ఈ రూమర్ల నడుమ చెన్నై క్వీన్ త్రిష ఓ పొలిటికల్ బ్యాక్‌డ్రాప్ సినిమాను అంగీకరించినట్లు ప్రచారం జరుగుతోంది. తమిళనాడు మాజీ సీఎం జయలలిత పాత్రలో నటించనున్నట్లు టాక్ నడుస్తోంది.

**ప్రజానాయకుడు...**

ప్రజానాయకుడిగా అభిమానుల చేత నీరాజనాలు అందుకున్న తమిళ లెజెండరీ యాక్టర్, మాజీ సీఎం ఎంజీఆర్ జీవితం ఆధారంగా దర్శకనిర్మాత ఎంజే బషీర్ ఓ పాన్ ఇండియన్ మూవీని తెరకెక్కించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ వారంలోనే ఈ సినిమా ఓపెనింగ్ ఈవెంట్‌ను గ్రాండ్‌గా నిర్వహించబోతున్నట్లు ప్రకటించారు. ఎంజీఆర్ సినీ రాజకీయ జీవితంతో పాటు జయలలితతో అతడికి ఉన్న అనుబంధం గురించి ప్రజలకు తెలియని కోణాలతో ఈ పొలిటికల్ డ్రామా మూవీ రూపొందుతోన్నట్లు తెలిసింది.ఈ సినిమాలో ఎంజీఆర్ పాత్రలో పాన్ ఇండియన్ ఇమేజ్ ఉన్న హీరో నటించబోతున్నట్లు బషీర్ పేర్కొన్నారు. జయలలిత పాత్ర కోసం త్రిషతో సంప్రదింపులు జరుపుతున్నట్లు వెల్లడించారు. చదువు, వ్యక్తిగత జీవితంతో పలు విషయాల్లో జయలలిత, త్రిష జీవితాల మధ్య దగ్గరి పోలికలు ఉన్నాయని నిర్మాత చెప్పారు



# విలన్‌గా జాన్వీకపూర్

రామ్‌చరణ్ పెద్ది తర్వాత సినిమాలకు స్మాల్ గ్యాప్ ఇచ్చింది శ్రీదేవి తనయ జాన్వీకపూర్. పెద్దిలో చేసిన అచ్చియమ్మ పాత్రపై దారుణంగా విమర్శలు రావడంతో కథల ఎంపికలో తన పంథా మార్చేసింది. టాలీవుడ్‌తో పాటు బాలీవుడ్‌లోనూ గ్లామర్ పాత్రలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నీ సుందరి నాలుగైదు నెలల తర్వాత మళ్లీ కెమెరా ముందుకొచ్చింది. ఓ బాలీవుడ్ మూవీ షూటింగ్‌ను సైలెంట్‌గా మొదలుపెట్టింది జాన్వీకపూర్.

**రొమాంటిక్ థ్రిల్లర్...**

జాన్వీకపూర్, శ్రీలీల హీరోయిన్లుగా హిందీలో ఓ రొమాంటిక్ థ్రిల్లర్ మూవీ తెరకెక్కుతోంది. ఉమేష్ బిస్త్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ శుక్రవారం నుంచి నైనిటాల్‌లో మొదలైంది. మొదటి షెడ్యూల్‌లో జాన్వీకపూర్, శ్రీలీలలపై డైరెక్టర్ కీలక సన్నివేశాలను చిత్రీకరించబోతున్నట్లు సమాచారం.

**నెగెటివ్ పాత్రలో...**

ఒకే అబ్బాయితో ప్రేమలో పడిన ఇద్దరమ్మాయిలతో కథతో ఊహించని ట్విస్ట్‌లు, టర్న్‌లతో సర్‌ప్రైజింగ్‌గా ఈ బాలీవుడ్ మూవీ ఉంటుందని మేకర్స్ చెబుతోన్నారు. ఇందులో జాన్వీకపూర్ పాత్ర నెగెటివ్ షేడ్స్‌తో సాగుతుందని అంటున్నారు. నటిగా తనను తాను కొత్తగా ఆవిష్కరించుకునే అవకాశం కోవడంతోనే విలన్‌గా నటించడానికి ఈ బాలీవుడ్ బ్యూటీ అంగీకరించినట్లు టాక్.

### ఈ వారం ఓటీటీలో రిలీజైన సినిమాలు, వెబ్‌సిరీస్‌లు ఇవే

| | |
|---|---|
| **అమెజాన్ ప్రైమ్ వీడియో:** | కుకూన్స్ (తెలుగు)<br>ది ట్రైలర్స్ (తెలుగు రియాలిటీ షో)<br>లెనిన్ పాండియన్ (తమిళ్)<br>హుకుమ్ (ఇంగ్లీష్)<br>ది సన్ నెవర్ సెట్స్ (ఇంగ్లీష్) |
| **నెట్‌ఫ్లిక్స్:** | ఎన్నవిలై (తమిళం)<br>టైసన్ (ఇంగ్లీష్)<br>హౌ టూ ట్రైన్ యువర్ డ్రాగన్ (ఇంగ్లీష్) |
| **ఆహా ఓటీటీ:** | ఎన్నై ఏదో సీద్రై (తమిళ్)<br>వాసు దేవ సుతం (తెలుగు)<br>సుగ్రీవ (తెలుగు)<br>దహన్ వెబ్‌సిరీస్ (తెలుగు) |
| **జియో హాట్ స్టార్:** | కప్పిస్క్వాడ్ (మలయాళం)<br>విజన్ క్వెస్ట్ (ఇంగ్లీష్)<br>డిస్కో జర్ డే (ఇంగ్లీష్) |
| **జీ5 ఓటీటీ:** | ఆశ (మలయాళం)<br>జీత్ కీ జిద్ (హిందీ) |
| **సన్ నెక్స్ట్ ఓటీటీ:** | కాగితం పడవలు (తెలుగు)<br>ఒరు అన్వేషింతే తుడక్కమ్ (మలయాళం) |
| **ఈటీవీ విన్:** | నల్లజర్ల రోడ్ (తెలుగు) |